# " ఉపాధ్యాయ వృత్తి కి స్వాగతం "



# మంచి వేతనం, తృప్తి నిచ్చే వృత్తి జీవితం ఉపాధ్యాయవృత్తి



ఒకప్పుడు బతలేక బడి పంతులు.
కానీ నేడు దర్జాగా బతికేందుకు బడి పంతులు ఉద్యోగం .
తాను సగౌరవంగా జీవిస్తూ - తన కుటుంబాన్ని చూసుకో
గల జీతం, జీవితం, సమాజంలో ఎప్పటికి తరగని గౌరవం.
క్రమంగా ఎదిగే అవకాశం, భావితరాలకు విద్యా దానం
చేస్తున్నానన్న సంతృప్తి వెరసి టీచర్ కెరీర్ ఔన్నత్యం .
టి.ఆర్.టి ద్వారా ఉపాధ్యాయుడిగా ఎంపిక అయ్యే అవకాశం
రానున్న నేపథ్యంలో టీచర్ కెరీర్ వివరాలు సంక్షిప్తంగా...

## యస్.జి.టి

సమాజంలోని వివిధ వృత్తులు అన్నీ వేటికవే ప్రాధాన్యత పరమైనవే. అయినా వాటన్నింటిలోకి ఉపాధ్యాయ వృత్తి అత్యంత ప్రాధాన్యత కలిగినది. అంతే కాదు పవిత్రమైన వృత్తి కూడా. భావి భారత పౌరులైన బాలలను భాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడంలోను, కుటుంబానికి, సమాజానికి మేలు చేసే విధంగా సంపూర్ణ విద్యావంతులుగా చేయటం లోను ఉపాధ్యాయుల కృషి వెల కట్టలేనిది. అందువలన ఉపాధ్యాయులుగా వృత్తి భాధ్యతలు చేపట్టాలనుకునే అభ్యర్ధులు గౌరవమైన, కీలకమైన వృత్తి లోకి ప్రవేశిస్తున్నామని తెలుసుకోవాలి.

ఉపాధ్యాయ వృత్తిలోకి ప్రవేశించాలనుకునేవారు స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్, లాంగ్వేజ్ పండిట్, ఫిజికల్ ఎడ్యూకేషన్ టీచర్ ఇలా వివిధ పోస్టులలోకి అర్హతలు, అభిరుచుల మేరకు ప్రవేశించ వచ్చు . చిన్న వయస్సులోనే ఈ పోస్టులోకి ప్రవేశిస్తే కెరీర్ లో ముందుకు వెళ్లడానికి, జీత భత్యాల రూపంలో అధిక మొత్తం పొందడానికి అవకాశం ఉంటుంది.

### సెకండరీ గ్రేడ్ టీచర్

సెకండరీ గ్రేడ్ టీచర్ గా సెలక్ట్ అయిన అభ్యర్ధులు 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు పాఠాలు భోదించవలసి ఉంటుంది . విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం యస్.జి.టి పోస్టులను డిప్లమో ఇన్ ఎడ్యూకేషన్ - డి.ఇ.డి చేసిన అభ్యర్ధులతో భర్తి చేస్తున్నారు . సెకండరీ గ్రేడ్ టీచర్ సెలక్ట్ అయిన అభ్యర్ధి తన కెరీర్ లో డిపార్ట్‌మెంట్ పరీక్షలల్లో ఉత్తీర్ణులై జిల్లా విద్యాశాఖాధికారి పోస్టు వరకు పదోన్నతి పొందవచ్చు .

| సెకండరీ గ్రేడ్ టీచర్ మొదటి నెల అందుకునే జీతం | |
|---|---|
| బేసిక్ పే | రూ.35,750 |
| డిఏ | రూ. 8,092 |
| హెచ్ఆర్ఏ | రూ. 4,268 |
| మొత్తం | రూ.48,110 |

## స్కూల్ అసిస్టెంట్ కెరీర్

### యస్.జి.టి పదోన్నతి క్రమం

డిస్ట్రిక్ట్ ఎడ్యూకేషన్ ఆఫీసర్
↑
డిప్యూటి ఎడ్యూకేషన్ ఆఫీసర్
↑
హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు/యం. ఇ. ఓ
↑
స్కూల్ అసిస్టెంట్
↑
యస్. జి. టి

### స్కూల్ అసిస్టెంట్

సెకండరీ గ్రేడ్ టీచర్ గా సెలక్ట్ అయిన అభ్యర్ధులు 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు పాఠాలు భోదించవలసి ఉంటుంది . విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం యస్.జి.టి పోస్టులను డిప్లమో ఇన్ ఎడ్యూకేషన్ - డి.ఇ.డి చేసిన అభ్యర్ధులతో భర్తి చేస్తున్నారు . సెకండరీ గ్రేడ్ టీచర్ సెలక్ట్ అయిన అభ్యర్ధి తన కెరీర్ లో డిపార్ట్‌మెంట్ పరీక్షలల్లో ఉత్తీర్ణులై జిల్లా విద్యాశాఖాధికారి పోస్టు వరకు పదోన్నతి పొందవచ్చు .

| స్కూల్ అసిస్టెంట్ మొదటి నెల అందుకునే జీతం | |
|---|---|
| బేసిక్ పే | రూ.44,575 |
| డిఏ | రూ.11,765 |
| హెచ్ఆర్ఏ | రూ. 7,131 |
| మొత్తం | రూ.63,471 |

# ఉపాధ్యాయ వృత్తే ఉన్నత పదవి!



**లక్షలు వెచ్చించి అమ్మవార్ల పండుగలు జరుపుకోవడం, కోట్లు ఖర్చు చేసి ఆలయాలను నిర్మించడం కాదు మనం చేయవలసింది. ప్రతి గ్రామ, పట్టణ ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ విద్యా సంస్థలను అభివృద్ధి చేసుకొనేందుకు ప్రజలు ఎక్కడికక్కడ సంసిద్ధులు కావాలి. అదే విధంగా సమాజాన్ని మార్చగలిగేది, సరి అయిన బాటలో పెట్టగలిగేది, అభివృద్ధి పథంలోకి నడిపించ గలిగేది ఒక్క గురువులు మాత్రమే.**

'అతీత ఖ్యాతి జాతి నిర్మాతలు వీరు–అతుల బాధ్యతాయుత ఉపాధ్యాయులు వీరు!'

ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఇద్దరు సాటిలేని మేటి ఉపాధ్యాయులను స్మరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఒకరు అబ్దుల్ కలామ్ అయితే రెండవ వారు హార్వర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య జె. హెచ్. రైట్. ప్రపంచమంతా ఒకే విధంగా గౌరవించే వృత్తి ఉపాధ్యాయ వృత్తి. గురువును పూజించే విషయంలో దేశాల మధ్య తేడా ఉండొచ్చుగాని,గౌరవించడం అనేది ప్రపంచమంతటా ఒకటే. ఉపాధ్యాయుడ్ని గౌరవించే రూపాలు ఆయా దేశాల్లోని సంప్రదాయాల మీద ఆధారపడి ఉంటుంది తప్ప గౌరవించడానికి కొలమానం మాత్రం కాదు. మనసులో గురువుపట్ల ఉండే గౌరవంలోమాత్రం ప్రపంచంలో ఎక్కడ చూచినా ఎటువంటి వ్యత్యాసం కనిపించదు. దీనికి కారణం ఒక వ్యక్తి అభివృద్ధిలో గురువుకు గల కీలక పాత్రపై మనకున్న అపారమైన నమ్మకం. మన గ్రంథాలు అయితే గురువుకిచ్చినంత ఉన్నత స్థానం ప్రపంచంలో ఏ గ్రంథాలు ఇవ్వలేదనే చెప్పాలి.


ఇంతటి ప్రజాదరణ, అపారమైన గౌరవం ఉన్న కారణంగానే ఎంతోమంది ఉపాధ్యాయులు నాయకులయ్యారు. వీరిలో ముఖ్యంగా చెప్పుకోవలసిన వారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. ఎందుకంటే ఒక ఉపాధ్యాయుడు ఈ భారత ఉపఖండానికి మొదటి పౌరుడు కూడా కాగలరని నిరూపించారు. అందుకనే ఆయన పుట్టిన రోజును మన దేశంలో ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటాము. సర్వేపల్లి రాధాకృష్ణన్ వలన ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న గౌరవం మరింత పెరిగింది. ఈ కారణంగానే ఉపాధ్యాయునికి సంబంధించిన ఏ సమావేశమైనా సర్వేపల్లి గురించి ప్రస్తావించకుండా ముగియదు. అదే విధంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అహ్మదాబాద్‌లో ఉపాధ్యాయునిగా పనిచేసిన డాక్టర్ మన్మోహన్ సింగ్ కూడా ఎన్నో ఉన్నత పదవుల నధిరోహించి, రెండు పర్యాయాలు ప్రధాన మంత్రిగా కూడా ఉన్నారు. ఇది కూడా ఉపాధ్యాయులకు గర్వకారణంగా చెప్పకోవలసినదే.

అయితే 2007 తర్వాత ఉపాధ్యాయుని కీర్తి ఆకాశమే హద్దుగా ఎదిగింది. దీనికి కారణం అమరజీవి అబ్దుల్ కలామ్. అబ్దుల్ కలామ్ తన రాష్ట్రపతి పదవీకాలం 2007లో ముగియగానే చెన్నైలోని అన్నా విశ్వ విద్యాలయంలో ఉపాధ్యాయునిగా చేరారు. ఆ రోజు నుంచి తను మరణించే వరకు బోధిస్తూనే ఉన్నారు. ఈ విధంగా కలామ్ రాష్ట్రపతి పదవి తర్వాత ఉపాధ్యాయ వృత్తిని చేపట్టడం ద్వారా యావత్ ప్రపంచా నికి అపూర్వమైన ఎన్నో సందేశాలను అందించారు. కలామ్ ఉపాధ్యాయ వృత్తి స్వీకరణ ద్వారా భారత్‌లో అత్యుత్తమ పదవి రాష్ట్రపతి పదవి కాదు, ఉపాధ్యాయ వృత్తే అన్న సందేశం వెలుగులోకి వచ్చింది. మేధావులైన శాస్త్రవేత్తలు మొదలగువారు ఉద్యోగ విరమణ ద్వారా తమ మేధోసంపత్తిని, అనుభవాలను విద్యార్థులతో తమ చివరి నిమిషం వరకు పంచుకోవాలి.


అందుకోసం వారు తమకు నచ్చిన విద్యాసంస్థలో ప్రవృత్తిగా ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించాలి. కలామ్‌ని మార్గదర్శకులుగా చేసుకొని చివరి నిమిషం వరకు విద్యార్థులతో మమేకమవ్వాలి. ప్రతి మేధావి వృత్తి పరంగా తను ఏ పదవిని నిర్వహించిన ఆ పదవీ విరమణ తరువాత బోధనను తన ప్రవృత్తిగా చేపట్టవలసిన బాధ్యత ఉంది. ఎందుకంటే జ్ఞాన సముపార్జన ఒక్క గురువు బోధనల వలనే సంపూర్ణంగా ప్రాప్తిస్తుంది తప్ప పుస్తక పఠనం వలనో, దూర విద్యా విధానం వల్లనో సంపూర్ణం కాదు. కలామ్ తనకు జన్మనిచ్చిన తమిళ నాడు రాష్ట్రంలో, తనకు విద్యను ప్రసాదించిన అన్నా విశ్వవిద్యాలయంలో రాష్ట్రపతి పదవి విరమణ తర్వాత ఉపాధ్యాయ వృత్తిని ప్రవృత్తిగా స్వీకరిం చారు. 'మరణించే వరకు పనిచేయడమే ఆరోగ్యం' అని యావత్ ప్రపంచానికి తను ఆచరించి ఈ సందేశాన్ని అందించిన మహాత్ముడు కలామ్. షిల్లాంగ్‌లో ఐఐఎంలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ కలామ్ మరణించారు. తను ప్రేమించిన విధి నిర్వహణలోనే మరణం పొందిన ఆదర్శ ఉపాధ్యాయుడు కలామ్.

అదే కోవకు చెందిన అమెరికాలోని హార్వర్డ్ విశ్వవి ద్యాలయానికి చెందిన గ్రీకు భాషా ఉపాధ్యాయుడు ఆచార్య జె. హెచ్. రైట్. 1893లో విశ్వమత సభల ద్వారా మొట్టమొదటి సారిగా ప్రపంచానికి భారత ధార్మిక సంప్రదాయాల ఔన్నత్యాన్ని చాటిచెప్పిన వ్యక్తి స్వామి వివేకానంద. ఆయన్ని చికాగోలో జరిగిన విశ్వమత మహాసభల అధ్యక్షులు బారోస్‌కు పరిచయం చేసిన వ్యక్తి ఆచార్య జె. హెచ్ రైట్. పరిచయం వల్లనే వివేకానందకు విశ్వ మత మహాసభల్లో ప్రసంగించేందుకు అవకాశం లభించింది. విశ్వ మత మహా సభల్లో పాల్గొనేందుకు పరిచయ పత్రం లేని కారణంగా వివేకానంద స్వదేశానికి వెనుదిరుగుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆచార్య జె. హెచ్ రైట్ సభ అధ్యక్షుడు బారోస్‌కు ఒక ఉత్తరం రాశారు. 'స్వామి వివేకానందకు పరిచయ పత్రం ఉందా అని అడగడం ఆ సూర్య భగవానుని నీకు ప్రకాశించే హక్కు ఉందా? అని అడగడమంత తప్పు' అని రాశారు. అందువలన గురువు ఒకసారి నమ్మితే తాను నమ్మిన దాని కోసం ఎంతవరకైనా వెళ్ళగల సాహసిగా ఉండాలి. అదే కలామ్ కూడా ఆచరించారు.

**చేయూత ఫౌండేషన్**



"విద్యార్థులలో దాగి ఉన్నటువంటి అంతర్గత శక్తులను బహిర్గతం చేయగలిగినప్పుడే ఉపాధ్యాయుడు పాఠశాలగదిలో విద్యార్థుల ముందు రాణించగలడు." – స్వామి వివేకానంద



"ప్రతి పిల్లాడిలోనూ ఒక ప్రత్యేక సామర్థ్యం ఉంటుంది. దాన్ని కనిపెట్టి బయటికి తీయాల్సింది ఉపాధ్యాయులే.
విద్య పరిధిని పాఠ్యపుస్తకాలను దాటించి విస్తరింపజేయాలి.
కరుణ, సహానుభూతి, పడిలేచే సామర్థ్యాలను అలవరచాలి."

– గిజుభాయ్ బధేకా, విద్యావేత్త

# DSC రాసే అభ్యర్థులకు సూచనలు.

# పరీక్షా కేంద్రంలో పాటించాల్సిన నియమాలు



- అభ్యర్థులు ఆన్‌లైన్ పరీక్షా తేదీని, రిజిస్ట్రేషన్ సంఖ్య పరీక్షా కేంద్ర వివరాలను ముందుగానే సరిచూసుకోవాలి.
- హాల్‌టికెట్ పై ఫోటో ముద్రితం కాకపోతే ఒక పాస్ పోర్టు సైజ్ ఫోటోను, గజిటెడ్ అధికారి సంతకం (Attestation) తో తీసుకుని రావాల్సి ఉంటుంది. ఇలాంటివారు తప్పని సరిగా గుర్తింపు కార్డు వెంట తీసుకొని వెళ్ళాలి.
- డి.ఎస్.సి. రాసే అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలి.
- పరీక్ష నిర్దేశించిన సమయానికే ప్రారంభమవుతుంది. నిర్ణీత సమయానికి మించి ఒక్కనిమిషం ఆలస్యమైనా అనుమతించరు.
- అభ్యర్థులు తప్పనిసరిగా గుర్తింపు (ఆధార్, ఓటర్) తదితర కార్డును వెంటతెచ్చుకోవాలి.
- పరీక్షా హాలులోనికి ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్, ట్యాబ్, ఐప్యాడ్స్ వంటి పరికరాలను అనుమతించరు.
- అడ్మిట్ కార్డు పై ఉన్న పాస్‌వర్డ్‌ను, ఉపయోగించి లాగిన్ అవ్వాలి. తర్యాత కంప్యూటర్ స్క్రీన్‌పై కనిపించే వివరాలను సరిచూసుకొని ఐ-కన్‌ఫార్మ్ అనే చోట క్లిక్ చేయ్యాల్సి ఉంటుంది.
- తొలుత నిభందనలన్నీ చదివి అర్థం చేసుకున్న తరువాతే స్క్రీన్ కు వెళ్ళాలి.
- పరీక్షా సమాయం :2-30 గంటలు ఉంటుంది. అడ్మిట్ కార్డు, పాస్‌వర్డ్‌తో అభ్యర్థులు లాగిన్ అవ్వాలి.
- లాగిన్ అయ్యాకే స్క్రీన్‌పై వచ్చిన వివరాలు సరిచూసుకోవాలి.
- కంప్యూటర్ స్క్రీన్‌పై సమయం తెలుస్తుంది. జవాబు ఇచ్చిన తర్వాత సేవ్ బటన్, నొక్కితే తర్వాత ప్రశ్నకు వెలుతుంది.
- స్క్రీన్ కుడిభాగంలో సెక్షన్ బటన్ క్లిక్‌చేస్తే జవాబులు స్వీకరిస్తుంది.
- కంప్యూటర్ స్క్రీన్‌పై ఇచ్చిన అక్షరాల సైజు పెంచుకోవాలనిపిస్తే, అక్షరాల పరిమానాన్ని ఇన్విజిలేటర్ సహకారంతో మార్చుకోవచ్చు.
- అభ్యర్థులు కేవలం మౌస్‌ను మాత్రమే ఉపయోగించాలి, కీ.బోర్డు లాగితే **CBT-ID** లాక్ అవుతుంది. అన్‌లాక్ చెయ్యడానికి ఇన్విజిలేటర్ సహాయం తీసుకోవాలి.
- ఇచ్చిన నాలుగు సమాధానాల్లో సరైన దానిని ఎంపిక చేసుకొని, మౌస్‌తో క్లిక్ చేయ్యాలి.
- ఒక ప్రశ్నకు ఇచ్చిన సమాధానం సరైంది కాదని భావిస్తే క్లియర్ రెస్పాన్స్ బటన్ నొక్కాలి.
- జవాబు రాయని ప్రశ్నలు ఎరుపురంగులోను, ప్రయత్నించని ప్రశ్నలు తెలుపురంగులోను, పునఃపరిశీలనకు గుర్తించిన ప్రశ్నలు ఉదారంగులోను కనిపిస్తాయి.
- జవాబు ఇచ్చి పునఃపరిశీలనకు గుర్తించిన ప్రశ్నలకు జవాబు ఇచ్చినట్లుగానే భావించాల్సి ఉంటుంది.
- పరీక్షి రాయడం ప్రారంభించిన తర్వాత మిగిలి ఉన్న సమయం ఎప్పటికప్పుడు స్క్రీన్‌పై కనిపిస్తుంది.
- కుడివైపున ఉండే సెక్షన్ బటన్ నొక్కడం ద్వారా, జవాబు ఇచ్చిన, ఇవ్వని, పునఃపరిశీలనకు గుర్తించిన ప్రశ్నలను చూడవచ్చు.
- పరీక్షా సమయం ముగిసే వరకు అభ్యర్థులను బయటకు పంపరు.
- పరీక్షకు కేటాయించిన సమయం పూర్తి కాగానే సబ్మిట్ బటన్ యాక్టివేట్ అవుతుంది. బటన్‌ను తప్పని సరిగా నొక్కాలి.
- కంప్యూటర్‌లో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే ఇవ్విజిలేటర్ సహాయం తీసుకోవాలి. సాంకెతిక సమస్య తలెత్తి ఎక్కువ సమయం దుర్వినియోగమైతే, ఆ సమయాన్ని తిరిగి కేటాయించమని ఇన్విజిలేటర్‌ను కోరవచ్చు.
- దృష్టి లోపం ఉన్నవారు, వికలాంగులైన అభ్యర్థులకు, అదనంగా 30 నిమిషాల సమయం ఉటుంది.
- పరీక్షా కేంద్రంలో చట్టవిరుద్దమైన, చర్యలకు పాల్పడితే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటారు.

**Note :** గతంలో T.ET., DSC రాసిన అభ్యర్థులతో మా చేయూత ఫౌండేన్ జరిపిన సర్వేలో చాలామంది, విద్యార్థులు, కంప్యూటర్ పై సరైన పరిజ్ఞానం లేక చాలా ప్రశ్నలను వదిలివేయడం జరిగింది. తద్వారా T.ET లో మంచి స్కోర్ సాధించ లేక పోయాము అని తెలిపారు. మరో సారి, అలాంటి తప్పులు జరగకుండా ముందస్తు అవగాహన కోసం ఈ సుచనలు పాటించి DSC లో ఘనవిజయం సాధింస్తారని ఆశిస్తున్నాం!

**చేయూత ఫౌండేషన్**

2024 టెట్ టాపర్

# వసుంధర

vasundhara@eenadu.in

స్ఫూర్తి

# 150/150... సాధించింది!

తండ్రి కష్టాలను చూస్తూ పెరిగిన అమ్మాయి... అన్నింటికీ పరిష్కారం చదువే అని గట్టిగా నమ్మింది. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ క్రమంలోనే తాజాగా విడుదలైన ఏపీ టెట్ ఫలితాల్లో 150కి 150 మార్కులు సాధించింది కొండ్రు అశ్విని.


అశ్విని

విజయనగరం జిల్లా కేంద్రానికి చెందిన కొండ్రు వెంకటలక్ష్మి, కె.శంకరరావుల పెద్ద కూతురు అశ్విని. తండ్రి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కుటుంబంలో ఎవరూ చదువుకోలేదు. కనీసం తమ పిల్లలనైనా చదివించాలనుకున్నారు తల్లిదండ్రులు. ఆర్థిక స్థోమత లేకున్నా కష్టపడి చదివించారు. అందుకు తగినట్లే పిల్లలూ ప్రతిభ కనబరుస్తూ వచ్చారు. అశ్విని చదువంతా ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే పూర్తి చేసింది. చిన్నప్పటి నుంచి టీచర్ కావాలనే లక్ష్యం పెట్టుకుని, 2018 నుంచి టెట్(టీచర్ ఎలిజబిలిటీ టెస్ట్) రాస్తోంది. మొదటి ప్రయత్నంలో 130కి పైనే మార్కులు సాధించింది. ఐదుసార్లు టెట్ రాసిన తనకు మూడుసార్లు 140కి పైగా మార్కులు వచ్చాయి. ఇటీవల తెలంగాణ డీఎస్సీ రాసినా ఉద్యోగం రాలేదు. అయినా నిరాశపడకుండా ప్రయత్నిస్తూనే ఉంది అశ్విని. తాజాగా ఏపీ టెట్ పేపర్-1ఏ (ఎస్జీటీ)లో 150కి 150మార్కులు సాధించింది. డీఎస్సీ సాధించడం తన లక్ష్యమంటోంది అశ్విని. ఇద్దరూ ఆడపిల్లలే కదా! త్వరగా పెద్దమ్మాయికి పెళ్లి చెయ్యమని బంధువుల ఒత్తిడి ఓవైపు, పేదరికం మరోవైపు... అన్నింటినీ అధిగమించి తన కాళ్ల మీద తాను నిలబడాలనే ఆశయంతో ముందుకు సాగుతోంది. 'రోజూ తెల్లవారుజామున కరెంట్ అఫైర్స్ చదువుతాను. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు కోచింగ్ సెంటర్లో చదువుకునేదాన్ని. ఇంటికొచ్చాక మరోసారి చదువుకునేదాన్ని. ఒత్తిడికి గురవకుండా ప్రశాంతంగా ఉండేదాన్ని. అదే నా విజయ రహస్యం' అంటోంది అశ్విని.

- ఇంచెర్ల ధనలక్ష్మి, ఈటీవీ భారత్

స్ఫూర్తి

## అమ్మానాన్న సహకారంతో

# సాధించా..

## ఏపీ డీఎస్సీ 2018 సెకండ్ ర్యాంకర్ సుబ్రమణ్యం



నాపేరు యాండ్ర సుబ్రమణ్యం, తల్లి దండ్రులు అల్లారావ్ , అన్నవరం. మావూరు సీతనగర మండలంలోని వేలంపేట గ్రామం. చదువు కున్నదంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే. ఒకటి నుంచి 5 వరకు సీతన గరం ప్రభుత్వ పాఠశాల, 6 నుంచి 10 వరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల సీతనగరం, అలాగే డీఈడీ రాజమం డ్రిలో చదివాను.

తల్లి దండ్రుల సహకారంతోనే చదువుకున్నా.. మాకు సొంత వ్యవసాయ భూమి లేదు. అమ్మ, నాన్న కష్టపడి పనిచేసే చదివించారు. లేదంటే డబ్బు కావలసి వచ్చినప్పుడు బ్యాంకు రుణం తీసుకుని చదువుకునే వాడిని.అలాగే వివిధ రకాల లోన్‌ల ద్వారా తీసుకుని చదువులకు ఉపయోగించేవాడిని. ఒక్కోసారి ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ అవసరమైతే పనులు చేసి డబ్బు కూడబెట్టుకుని చదివాను. ఎలాగైనా జీవితంలో స్థిరపడాలని అందుకు ప్రభుత్వ ఉద్యోగం చేయాలని అనుకునే వాడిని. నా అర్హత ను బట్టి పరీక్షలు రాస్తుండేవాడిని. నేను టెట్ లో కూడా మంచి స్కోర్ సాధించాను . అలాగే డీ ఎస్సీ కూడా బాగా మా ర్కులు వచ్చాయి. ప్రణా ళిక ప్రకా రం చదవుతూ అనుకున్న లక్ష్యాలను చేరుకుంటూ ముందుకేళ్లా. వత్తిడికి గురి కాకుండా సమయపాలన పాటించాను. ఇతరులను ంచి మార్గదర్శకత్వం తీసుకునే వాడిని. న్యూస్ పే పర్‌లను బాగా ఫాలో అయ్యాను. అందులో వచ్చే ఆర్టికల్స్, పలు అంశాలు స్ఫూర్తినిచ్చాయి. ముందుగా సిలబస్‌కి ప్రాదాన్యత ఇచ్చాను. సిలబస్ ప్రకారం తెలుగు అకాడమీ పుస్తకాలు ముందుగా సేకరించాను. నాకు మొదటి నుంచి ఎవరి గైడెన్స్ లేదు . కేవలం తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే చదువుకున్నాను.

టెట్, డీఎస్సీ లపై అవగాహన కోసం గోదావరి కోచింగ్ సెంటర్‌లో కి వెళ్లాను. వారు నాకు మంచి మార్గదర్శకాలు అందించారు. ఫ్యాకల్టీ కూడా నాకు బాగా సహకరించారు. ప్రతి చిన్న విషయాన్ని పత్రి కలు ప్రభావితం చేసాయి. పోటీ పరీక్షల్లో పత్రికలను ఫాలో అయితే మెరగ్గా రాణించవచ్చు. సమాజానికి సేవ చేసే అదృష్టం ప్రభుత్వ సర్వీసుద్వారానే సాద్యం అవుతుంది. సివిల్స్, గ్రూప్స్ పరీక్షలకు ప్రిపేరవ్వాలనుకుంటున్నాను.

### ఉద్యోగం పక్కా..

**ఎస్‌జీటీ సిలబస్‌లో చాలా అంశాలుంటాయి**

**జీకే, కరెంట్ అఫైర్స్ :** జీకే అనేది నోటిఫి కేషన్ రాక ముందు నుంచి చదివితేనే మంచిది. కరెంట్ అఫైర్స్ కోసం మ్యాగజైన్ ఫాలో అవ్వాలి. జీకే, కరెంట్ అఫైర్స్ కు తెలుగు అకా డమీ పుస్తకాలను అనుసంధానం చేస్తూ నోట్స్ తయారు చేసుకుని చదవితే మంచి ఫలితాలుం టాయి. అలాగే దినపత్రికలు ఫాలో కావాలి. అకాడమీ పుస్తకాల ద్వారా ప్రిపేరయ్యాను. అలాగే సిలబస్‌లో అన్ని అంశాలు అకాడమీ పుస్తకాల్లో ఉండకపోవచ్చు. అప్పుడు ఇతర పబ్లికేషన్స్ కూడా ఏదైనా ఒకటి ఫాలో కావాలి. డీఈడీ పుస్తకంతోపాటు బీఈడీ పుస్తకాలు కూడా చదవాలి. ఎక్కువగా తెలుగు అకాడమీ పుస్తాకాలు చదివితే నే మంచిది.

### తెలుగు

ఈ విభాగం చాలా తేలిక దీని కోసం 3నుంచి 10వ తరగతి వరకు టెక్స్ట్ పుస్తకాలు చదివితే చాలు.

### ఇంగ్లీష్

ఇది అందరికీ కామన్‌గా ఉంటుంది. టెక్స్ట్ బుక్స్ నుంచి కాకుం డా కామన్‌గా అడుగుతున్నారు. ఇంగ్లిష్ ప్రొఫిషి యెన్సీ టెస్ట్ చేస్తారు. దీనికోసం మంచి పుస్తాకాలు చదవాలి. ఈ విభాగంలో టెక్ట్స్ పుస్తకంనుంచే వస్తాయి అని చెప్పలేం. కామన్‌గానే అడుగుతున్నారు. స్టాండర్డ్ మెటీరియల్ కూడా చూడాలి.

### మ్యాథ్స్

అకాడమీ పుస్తాకాలతో పాటు ఇతర పబ్లికేషన్స్ కూడా చదవాలి. ముఖ్యంగా ఫార్ములాలను బాగా నేర్చుకుంటూ చదవాలి. ఇది మంచి స్కోరింగ్ విభాగంగా చెప్పవచ్చు.

### ఈవీఎస్

సైన్స్, సోషల్ స్టడీస్ దీనిలో 3 నుంచి పదోఒతరగతి వరకు పాఠ్య పుస్తాకాలు సరిపోతాయి. మెథడ్స్ కోసం అకాడమీ బుక్స్ చాలా బాగా సరిపోతాయి. తెలుగు అకాడ మీ వారి పుస్తకాలు ప్రామాణికం. దీనిలో ఓల్డ్ లేదా న్యూ అనేది సిలబస్ ప్రకారం చదివితే సరిపోతుంది. ఎస్‌జీటీ కి సంబంధించి సిలబస్ ప్రకారం చూడాలి. ముం దుగా సిలబస్ తెలుగు అకాడమీలో ఉన్నాయా లేవా చూడాలి.

ఫ్యామిలీ



తల్లిదండ్రులు మడావి లక్ష్మణ్, కమలాబాయిలతో టీచరు ఉద్యోగం సాధించిన కుమార్తెలు కవిత, దివ్య, కళ్యాణి, టీచర్ కావడమే లక్ష్యమంటున్న చిన్నకుమార్తె కృష్ణప్రియ (కుడి చివర)

# ఈ ఇల్లు పాఠాలు నేర్పుతుంది

‘ఎంత మంది పిల్లలు?’ అనే ప్రశ్న వినిపించినప్పుడల్లా లక్ష్మణ్ గుండెల్లో రైళ్లు పరుగెత్తినంత పనయ్యేది. ఎందుకంటే...‘నాకు అయిదుగురు ఆడపిల్లలు’ అనే మాట లక్ష్మణ్ నోటినుంచి వినిపించడమే ఆలస్యం ‘అయ్యో!’ అనే అకారణ సానుభూతి వినిపించేది.

‘ఇంట్లో ఒకరిద్దరు ఆడపిల్లలు ఉంటేనే కష్టం. అలాంటిది అయిదుగురు ఆడపిల్లలంటే మాటలా! నీ కోసం చాలా కష్టాలు ఎదురుచూస్తున్నాయి’ అనేవాళ్లు.

అయితే వారి పెదవి విరుపు మాటలు, వెక్కిరింపులు తనపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపించలేకపోయాయి.

ఈ ఇల్లు పిల్లలకు బడి పాఠాలు చెప్పే ఇల్లే కాదు... ఆడపిల్లల్ని తక్కువ చేసి చూసేవారికి గుణపాఠాలూ చెబుతుంది.

ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌కు చెందిన మడావి లక్ష్మణ్ బాల్యమంతా పేదరికంలోనే గడిచింది. ఆదివాసీ తెగకు చెందిన లక్ష్మణ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడైన తరువాత ఆర్థిక కష్టాలు తీరాయి.

లక్ష్మణ్– కమలాబాయి దంపతులకు మొదటి సంతానంగా ఆడపిల్ల పుట్టింది.

‘ఆడపిల్ల ఇంటికి అదృష్టం’ అన్నారు చుట్టాలు పక్కాలు, పెద్దలు.

రెండోసారి ఆడపిల్ల పుట్టింది. వాతావరణంలో కాస్త మార్పు వచ్చింది. ‘మళ్లీ ఆడపిల్లేనా!’ అన్నారు.

‘ఇద్దరు పిల్లలు చాలు’ అనుకునే సమయంలో ‘లేదు... లేదు... అబ్బాయి కావాల్సిందే’ అని పట్టుబట్టారు ఇంటి పెద్దలు.

మూడో సారి... అమ్మాయి.

‘ముత్యాల్లాంటి ముగ్గురు పిల్లలు చాలు’ అనుకునే లోపే....

‘అలా ఎలా కుదురుతుంది....అబ్బాయి...’ అనే మాట మళ్లీ ముందుకు వచ్చింది.

నాల్గోసారి... అమ్మాయి.

‘ఇక చాలు’ అని గట్టిగా అనుకున్నా సరే... పెద్దల ఒత్తిడికి తలవొంచక తప్పలేదు.

‘ఆరు నూరైనా ఈసారి కొడుకే’ అన్నారు చాలా నమ్మకంగా పెద్దలు. దేవుడికి గట్టిగా మొక్కుకున్నారు.

అయిదోసారి... అమ్మాయి.

‘అయ్యయ్యో’ అనే సానుభూతులు ఆకాశాన్ని అంటాయి. అయితే లక్ష్మణ్, కమలాబాయి దంపతులు ఎప్పుడూ నిరాశపడలేదు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు అయినప్పటికీ ఖర్చులకు సరిపడా జీతం రాకపోవడంతో ఖర్చులు పెరిగాయి. ‘ఎంత ఖర్చు అయినా, అప్పు చేసైనా సరే పిల్లలను బాగా చదివించాలి’ అని గట్టిగా నిర్ణయించుకున్నాడు లక్ష్మణ్.

పిల్లల్ని చదివించడమే కాదు ఆడపిల్లలు అనే వివక్ష ఎక్కడా ప్రదర్శించేవారు కాదు. ఆటల్లో, పాటల్లో వారికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చేవారు. పిల్లలు బాగా చదువుకోవాలంటే బెత్తం పట్టుకోనక్కర్లేదు. వారికి నాలుగు మంచి మాటలు చెబితే సరిపోతుంది. ఆ మాటే వారికి తిరుగులేని తారక మంత్రం అవుతుంది.

అయిదుగురు పిల్లల్ని కూర్చోపెట్టుకొని ‘‘అమ్మా... మీ నాయిన టీచర్. మా నాయినకు మాత్రం చదువు ఒక్క ముక్క కూడా రాదు. నాకు మాత్రం సదువుకోవాలనే బాగా ఇది ఉండే. అయితే మా కుటుంబ పరిస్థితి చూస్తే... ఇంత దీనమైన పరిస్థితుల్లో సదువు అవసరమా అనిపించేది. ఎందుకంటే సదువుకోవాలంటే ఎంతో కొంత డబ్బు కావాలి. ఏ రోజుకు ఆరోజే బువ్వకు కష్టపడే మా దగ్గర డబ్బు ఎక్కడిది! అయినా సరే సదువుకోవాలని గట్టిగా అనుకున్నాను. ఎన్నో కష్టాలు పడ్డాను...’ అని నాన్న చిన్నప్పుడు చెప్పిన మాటలు పిల్లలపై బలమైన ప్రభావాన్ని చూపాయి. వారు చదువును ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు. ఆ ఫలితం వృథా పోలేదు.

ఇప్పుడు...

రెండో కూతురు కవిత, మూడో కూతురు దివ్య, నాల్గో కూతురు కళ్యాణి ప్రభుత్వ ఉపాధ్యాయులు. చిన్న కూతురు కృష్ణప్రియ కొద్ది మార్కుల తేడాతో టీచర్ అయ్యే చాన్స్ మిస్ అయింది. అక్కలలాగే టీచర్ కావాలని కలలు కంటున్న కృష్ణప్రియకు మరో ప్రయత్నంలో తన కల నెరవేర్చుకోవడం పెద్ద కష్టం కాకపోవచ్చు. అప్పుడు ఒకే ఇంట్లో నలుగురు టీచర్‌లు!

ఇంటర్ వరకు చదివిన పెద్ద కూతురు రత్నకుమారి చెల్లెళ్ల స్ఫూర్తితో పై చదువులు చదవాలనుకుంటోంది. వారిలాగే ఒక విజయాన్ని అందుకోవాలనుకుంటుంది. ఇప్పుడు లక్ష్మణ్‌ను చూసి జనాలు ఏమంటున్నారు?

‘నీకేమయ్యా... ఇంటినిండా టీచర్‌లే!’

‘మీది టీచర్స్ ఫ్యామిలీ’

– గోడిసెల కృష్ణకాంత్, సాక్షి, ఆదిలాబాద్

ఫొటోలు: చింతల అరుణ్ రెడ్డి

### నాన్న మాటలు

తల్లిదండ్రులు మమ్మల్ని ఎప్పుడూ చిన్నచూపు చూడలేదు. వారి ఆశీర్వాద బలంతోనే టీచర్ అయ్యాను. ‘చదువే మన సంపద’ అని నాన్న ఎప్పుడూ చెబుతుండే వాడు. ఆయన మాటలు మనసులో నాటుకుపోయాయి.

– కవిత, రెండో కుమార్తె

### నేను టీచర్... అక్క హెడ్‌మాస్టర్

అక్క కవితకు, నాకు ఒకేసారి ఉద్యోగాలు వచ్చాయి. ప్రస్తుతం నేను జైనూర్ మండలం జెండాగూడలో ఎస్జీటీగా పనిచేస్తున్నాను. మా స్కూలుకు అక్క కవితనే ప్రధానోపాధ్యాయురాలు. చిన్నప్పటి నుంచి కలిసి పెరిగిన మేము ఇప్పుడు ఒకే బడిలో పనిచేస్తుండటం సంతోషంగా ఉంది.

– దివ్య, మూడో కుమార్తె

### ఆరోజు ఎంత సంతోషమో!

మొన్నటి డీఎస్సీలో టీచర్ ఉద్యోగం వచ్చింది. ఆదిలాబాద్ జిల్లా సిరికొండలో నాకు పోస్టింగ్ ఇచ్చారు. మొన్ననే విధుల్లో చేరాను. టీచర్‌గా మొదటి రోజు స్కూల్‌కి వెళ్లినప్పుడు నాకు కలిగిన సంతోషం అంతా ఇంతా కాదు. ‘మా ముగ్గురు పిల్లలు టీచర్‌లే అని ఇప్పుడు గర్వంగా చెప్పుకుంటాను’ అంటున్నాడు నాన్న.

– కళ్యాణి, నాలుగో కుమార్తె

### టీచర్ కావడమే నా లక్ష్యం

అక్క కళ్యాణితో కలిసి నేను కూడా మొన్నటి డీఎస్సీ పరీక్ష రాశాను. కొద్ది మార్కుల తేడాతో నాకు ఉద్యోగం చేజారింది. అయితే నా లక్ష్యాన్ని మాత్రం వీడను. ఎలాగైనా టీచర్ కొలువు సాధిస్తాను.

– కృష్ణప్రియ, ఐదో కుమార్తె

ఆమధ్య వచ్చిన కమల్‌హాసన్ సినిమాలో ఒక డైలాగ్....
'ఈ లోకంలో అత్యంత ధైర్యవంతులు ఎవరో తెలుసా?
కోల్పోవడానికి ఏమీ మిగలని వాళ్లు!'
ఒకప్పుడు హుమేరా బేగం పరిస్థితి అలాగే ఉండేది.
సివిల్స్‌కు ఎంపిక కావాలనేది తన లక్ష్యం.
ఆ లక్ష్యం వైపు అడుగులు పడకుండానే...'మేమున్నాం' అంటూ
సమస్యలు, వాటితోపాటు వచ్చిన బాధలు వరుస కట్టాయి.
ఇలాంటప్పుడు లక్ష్యం మసక మసకగా కనిపించడం మాట అటుంచి
అసలే కనిపించకపోయే ప్రమాదం ఉండవచ్చు.
'కోల్పోవడానికి ఏమీ లేదు' అనుకునే స్థితిలో ఉన్న తనకు
భయం ఎందుకు!
ఆ ధైర్యంతోనే సమస్యలను తట్టుకునే నిలబడింది.
ఎస్‌జీటి ఉర్దూ టీచర్‌గా సెలెక్ట్ అయింది.
మరి సివిల్స్ కల..? అంటారా...
'వెయ్యి మైళ్ల ప్రయాణం అయినా,
ఒక అడుగుతోనే ఆరంభం అవుతుంది'
అనే మాట మనకు తెలియనిది కాదు...



ఉర్దూ టీచర్‌గా
హుమేరా బేగం...

# టీచర్ కొలువిచ్చిన సివిల్ పవర్

హుమేరా బేగం స్వస్థలం తెలంగాణాలోని వనపర్తి. నాన్న రోజువారీ కూలీగా సైదాబాద్ (హైదరాబాద్)లో ఒక మదర్సాలో పని చేసేవాడు. అమ్మ ఉర్దూ టీచర్‌గా కొంతకాలం పని చేసింది. అన్న ఓబిద్ మానసిక సమస్యతో బాధ పడుతున్నాడు. ఐఏఎస్ ఆఫీసర్ కావాలనేది హుమేరా చిన్నప్పటి కల. హుమేరా ఏడో తరగతిలో ఉన్నప్పుడు కష్టాలు మొదలయ్యాయి.

తండ్రి పక్షవాతం బారిన పడ్డాడు. తండ్రి అనారోగ్య ప్రభావం హుమేరా చదువుపై పడింది. ప్రైవేట్ స్కూల్ నుంచి చాదర్‌ఘట్‌లోని గవర్నమెంట్ స్కూల్‌లో చేర్పించారు. అక్కడే పదో తరగతి పూర్తి చేసింది. మరోవైపు తండ్రి ఆరోగ్యం పూర్తిగా క్షీణించి తమకు దూరం కావడానికి ఎంతో కాలం పట్టలేదు.

'నా తండ్రి వెయ్యి ఏనుగుల బలం' అనుకునే అమ్మాయి 'తండ్రి లేని బిడ్డ' అయింది.

తండ్రి చనిపోవడంతో ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారింది. దీంతో హైదరాబాద్ నుంచి తిరిగి వనపర్తి వెళ్లిపోయారు. హైదరాబాద్ విడిచి వెళుతున్నప్పుడు కళ్లలో నీళ్లు తిరిగాయి. 'హైదరాబాద్ అంటే పెద్ద సిటీ... పెద్ద చదువులు చదువుకోవచ్చు' అనుకునేది.

ధైర్యం ఇచ్చే నాన్న లేడు.

ధైర్యం ఇచ్చే మహా నగరం దూరం అయింది.

అయితే తన కల మాత్రం దూరం కాకుండా జాగ్రత్త పడింది. హుమేరాలో చదువుకోవాలనే తపన చూసి అక్క (చిన్నమ్మ కూతురు) సమీన, కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బావ అహ్మద్ అలీ హుమేరా కుటుంబాన్ని మళ్లీ హైదరాబాద్ తీసుకువచ్చారు.

పట్టుదల గట్టిదైతే ఒక్కో ద్వారం దానికదే తెరుచుకుంటూ దారి చూపుతుంది. హుమేరాకు చదువుపై ఉండే ఆసక్తి, పట్టుదల, కల జైలు సూపరింటెండెంట్ వరకు వెళ్లింది. చంచల్‌గూడ సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్‌గౌడ్ 'సేవ్ ద గర్ల్ చైల్డ్' సంస్థ తరపున హుమేరాకు అండగా నిలబడ్డాడు. 'మేము సైతం' అన్నారు జైలు సిబ్బంది. తమ పిల్లలకు ట్యూషన్లు చెప్పేందుకు హుమేరాకు అవకాశం ఇచ్చారు.

జైలు అధికారులు, సిబ్బంది సహకారం హుమేరా కుటుంబానికి ఆర్థికంగా భరోసాను ఇచ్చాయి. ఆమెలో ఆత్మవిశ్వాస శక్తిని రెండింతలు చేశాయి. ఎన్ని సమస్యలు ఎదురైనా ఇంటర్ ఎంపీసీ పూర్తి చేసింది. నేరేడ్‌మెట్‌లో డీఎడ్ కూడా పూర్తి చేసింది. కష్టపడే వారిని విజయం వెదుక్కుంటూ వస్తుంది... అన్నట్లు హుమేర కష్టం వృథా పోలేదు. ఎస్‌జీటీ ఉర్దూ టీచర్‌గా ఎంపిక అయింది.

ఒకప్పుడు...

'ఐఏఎస్ కావాలనేది నా కల' అని హుమేరా అని ఉంటే నవ్వేవాళ్లేమో. ఎందుకంటే తాను ఉన్న దయనీయమైన పరిస్థితుల్లో ఇంటర్మీడియేట్ పూర్తి చేయడమే చాలా కష్టం. ఇప్పుడు ఎవరూ ఎగతాళిగా నవ్వే పరిస్థితి లేదు.

'యస్... ఆ అమ్మాయి కచ్చితంగా సాధిస్తుంది' అంటారు ఇప్పుడు. ఈ నమ్మకం కలిగించడానికి ఆమె ఎంతో కష్టపడింది. గుండె ధైర్యాన్ని ఎప్పుడూ కోల్పోలేదు. హుమేరాది ఎంతోమంది పేద అమ్మాయిలకు స్ఫూర్తినిచ్చి ముందుకు నడిపించే పట్టుదల.

ఆమె భవిష్యత్ కల నెరవేరాలని బలంగా కోరుకుందాం.

– నాగోజు సత్యనారాయణ,
సాక్షి, హైదరాబాద్ స్టేట్ బ్యూరో

## జీవితం ముగిసిపోయింది అనుకున్న సమయంలో....



శివకుమార్ గౌడ్

సివిల్స్ సాధించాలనే నా కలను దృష్టిలో పెట్టుకొని 'సేవ్ ద గర్ల్ చైల్డ్' సంస్థ సహకారంతో శివకుమార్ గౌడ్ సార్ నాకు దిల్లీకి చెందిన ఓ కోచింగ్ సెంటర్ ద్వారా ఆన్‌లైన్ సివిల్స్ కోచింగ్ ఇప్పిస్తున్నారు. ఓపెన్ డిగ్రీతో పాటు, నా ట్యూషన్లు కొనసాగిస్తూనే మిగిలిన సమయంలో సివిల్స్ కోసం ప్రిపేర్ అవుతున్నాను. నా జీవితం ముగిసింది అనుకున్న సమయంలో ఒక దారి దొరికింది. నాలా అవకాశాల కోసం కష్టపడే ఎంతోమంది పేద విద్యార్థులకు అండగా నిలబడేందుకే నేను సివిల్స్‌ను లక్ష్యంగా పెట్టుకున్నాను.

– హుమేరా బేగం





సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రాంబాబు

## స్ఫూర్తి

మానవత్వం అతని గుణం.. సేవాతత్పరత అతని సుగుణం. విద్యార్థులకు మెరుగైన విద్య అందించడం అతని వృత్తి. ఎదిగేకొద్దీ ఒదిగి ఉండటం అతని వ్యక్తిత్వం. నిరాడంబర జీవన విధానం అతని ఆభరణం. పుట్టింది సాధారణ వ్యవసాయ కుటుంబంలోనైనా నిరుపేదలకు తోడ్పాటు అందించడంలో ఆయన ఎప్పుడూ ధనికుడిగానే ఉంటారు. ఆయనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు అర్రిబోయిన రాంబాబు. పనిచేసిన ప్రతిచోటా మెరుగైన విద్యార్థులను తయారు చేయడం, నలుగురి మెప్పు పొందడం, పది మంది దాతలను సమీకరించడం, చదువుతోపాటు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం అతనికి వెన్నతోపెట్టిన 'విద్య'. 22 ఏళ్ల వృత్తి జీవితంలో పని చేసిన ప్రతిచోటా అతని పంథా ఇదే. అతని సేవకు మెచ్చి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రభుత్వం గుర్తించిన నేపథ్యంలో ప్రత్యేక కథనం..

### విద్యతోపాటు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తా



విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడంతోపాటు, పేదలకు పలు సేవా కార్యక్రమాల ద్వారా వారికి అండగా నిలవడమే ధ్యేయం. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు నా మీద మరింత బాధ్యతను పెంచింది. దీంతో సేవా కార్యక్రమాలను విస్తృతం చేయడానికి, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి నిరంతరం కృషి చేస్తా.

– అర్రిబోయిన రాంబాబు, ఉపాధ్యాయుడు

# సూపర్ మాస్టారు!

**వ్యవసాయ కుటుంబం నుంచి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎదిగిన అర్రిబోయిన**

- 22 ఏళ్ల సర్వీసులో మూడు పాఠశాలల్లో విద్యా బోధన
- పనిచేసిన ప్రతిచోటా విద్యార్థుల పెంపునకు విశేషకృషి
- విద్యార్థులతో మమేకం, దాతలను పోగేయడం...
- చదువుతోపాటు సేవా కార్యక్రమాలతో పేదలకు అండ
- స్ఫూర్తిగా నిలుస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు

సింగరాయకొండ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోమరాజుపల్లికి చెందిన అర్రిబోయిన రాంబాబు సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక విద్యను, సింగరాయకొండ ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ఉన్నత పాఠశాలలో హైస్కూల్ విద్యను అభ్యసించారు. ఇంటర్, డిగ్రీ కావలి జవహర్ భారతి కళాశాలలో పూర్తి చేశారు. అనంతరం ఉపాధ్యాయ శిక్షణను మదనపల్లెలో, పీజీ తిరుపతి వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పూర్తి చేశారు. 2002లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరారు. తన 22 ఏళ్ల సర్వీసులో ఇప్పటి వరకూ మూడు పాఠశాలల్లో పనిచేశారు. 2019లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. విద్యారంగంలో పాటు పలు సాంఘిక, సేవా కార్యక్రమాల ద్వారా పేదలకు సాయం అందిస్తున్న ఉపాధ్యాయుడు అర్రిబోయిన రాంబాబును రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు ప్రదానం చేసింది. గత సోమవారం విజయవాడలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ చేతులమీదగా అందుకున్నారు.

### విద్యారంగంలో విశేష కృషి

- 2002 ఏడాదిలో తొలుత జిల్లాలోని పీసీపల్లి మండలం గుంటూరు లింగన్నపాలెం పాఠశాల ఉపాధ్యాయుడి విధుల్లో చేరారు. పాఠశాలలో విద్యార్థుల పెంపునకు కృషిచేయడంతో పాటు, తను పనిచేసిన 8 ఏళ్లలో పాఠశాల ఆవరణలో 200 మొక్కలను నాటించారు.
- ఉలవపాడు మండలం చాకిచర్ల పంచాయతీ పరిధిలో సుబ్బరాయుడు సత్రంలోని ప్రాథమిక పాఠశాలలో తన విధుల్లో చేరినపుడు 11 మంది విద్యార్థులు మాత్రమే ఉండేవారు. గ్రామంలోని కాలనీల్లో తిరిగి విద్యార్థుల సంఖ్యను 44కు పెంచారు. దీంతో ఏకోపాధ్యాయ పాఠశాలకు రెండో ఉపాధ్యాయుడిని ప్రభుత్వం కేటాయించింది.
- 2017లో సింగరాయకొండ మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ పరిధి మల్లికార్జున్ నగర్ ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వచ్చారు. గిరిజన కాలనీలో విద్యార్థుల సంఖ్య పెంచి ప్రతి ఏడాదీ పేద విద్యార్థులకు విద్యా సామగ్రి, దుస్తులను తన సొంత నిధులు, దాతల సహకారంతో అందించారు.
- సింగరాయకొండకు చెందిన గంజి ప్రసాద్ యాదవ్ సహకారంతో పాఠశాలకు అవసరమైన ఓవర్‌హెడ్ ట్యాంకు, మంచినీటి కొళాయిలను ఏర్పాటు చేశారు. గిరిజన కాలనీలో ప్రతి ఇంటి ఆవరణలో పండ్ల, పూల మొక్కలను నాటించి కాలనీలో పచ్చదనానికి కృషిచేశారు.



విద్యార్థులకు మొక్కలు అందిస్తూ



దాతల సహకారంతో పాదరక్షలు అందిస్తున్న రాంబాబు

### సేవా కార్యక్రమాలు

- వృథా సుధా కార్యక్రమం ద్వారా శుభకార్యాలు, వివిధ ఫంక్షన్లలో మిగిలిపోయిన ఆహారాన్ని సేకరించి తన స్నేహితులతో కలిసి గిరిజన కాలనీల్లో పేదలకు పంచేవారు.
- వస్త్రనేస్తం అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టి సంపన్నులు, ఉద్యోగులు, స్థోమత కలిగిన వారి నుంచి తన మిత్రబృందంతో కలిసి వస్తువులు సేకరించి వాటిని నిరుపేదలకు, గిరజనులకు అందించేవారు.
- 'మొక్కలు నాటుదాం' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి మండలంలోని పలు కాలనీల్లో మొక్కలను నాటించారు.

# విద్యాకుసుమం




**కష్టాలు, కన్నీళ్లకు ఎదురొడ్డి నిలబడితేనే విజయాల చిట్టా తెరవగలిగేది. ఈ జీవిత సత్యాన్ని తెలుసుకుంది కాబట్టే శృంగవరపుకోట మండలం ధర్మవరానికి చెందిన వేమన కుసుమ డీఎస్సీ సెకండరీ గ్రేడ్ టీచర్ ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే మొదటి ర్యాంకరుగా నిలిచింది. 'ఏమయ్యా ఆడపిల్లలకు చదువెందుకయ్యా.. పెళ్లి చేసి పంపేస్తే పోయేదానికి' అంటూ తన తండ్రిని నిరుత్సాహపరుస్తూ అన్న అందరి మాటల్నే పట్టుదలగా తీసుకుని చదువుకున్నానని చెబుతుంది కుసుమ.**

నేనిప్పుడు డీఎస్సీ సెకండరీ టీచర్స్ పరీక్షలో 91.07 మార్కులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మొదటి ర్యాంకు సాధించానని అంతా అమ్మానాన్నల్ని పొగుడుతున్నారు. నాన్న సంతోషానికైతే అవధుల్లేవు. ఈ రోజు కోసమే నేను ఏళ్ల తరబడి శ్రమించా. నాకు చదువంటే ఎంతిష్టమని ఎవరైనా, అడిగితే నాన్నంత ఇష్టమని చెబుతా. మాది నిరుపేద కుటుంబం. నాన్న దర్జీ. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ఆయన మా చదువు ఆప లేదు. ఇంట్లో ముగ్గురు ఆడపిల్లలమున్నా ఎప్పుడూ మమ్మల్ని తక్కువగా చూడలేదు. 'ఆడపిల్లలు ఏమైనా దేశాలు ఏలాలా... పెళ్లి చేసి పంపేస్తే పోయేదానికి..' అంటూ ఎవరెవరో పదే పదే నాన్నకు చెప్పినా సరే... 'నా పిల్లలు వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడాలి' అంటూ సర్ది చెప్పేవారు. నేను చిన్నప్పటి నుంచి వింటున్న ఈ మాటలే నాలో పట్టుదల పెంచాయి. నాన్నకి వచ్చే ఆదాయం చాలా తక్కువ. అరకు, అనంతగిరి సంతల్లో బట్టలు అమ్ముకునే వ్యాపారులు చొక్కాకి రూ.15 మాత్రమే ఇస్తారు. నాన్న చిన్నప్పుడు ఇంట్లో ఆర్థిక పరిస్థితులు బాగోక ఏడో తరగతితోనే చదువు ఆపేశారట. చదువుకోలేకే సరిగా స్థిరపడలేక పోయాననేవారు. అందుకే మమ్మల్ని చదివిస్తున్నాని చెప్పేవారు.

### ఊరే మార్చారు...

వాస్తవానికి మాది శృంగవరపు కోట మండలం శ్యామలాపల్లి. ఊళ్లో మమ్మల్ని చదివించడానికి పాఠశాల లేదని నాన్న మమ్మల్ని ధర్మవరం తీసుకొచ్చేశారు. మా చదువు బాగుండాలని అక్క, చెల్లితో పాటు నన్నూ అక్కడే ఓ ప్రైవేటు పాఠశాలలో చేర్పించారు. నాలుగో తరగతిలో ఉన్నప్పుడు గురుకుల పాఠశాలలో సీటొచ్చింది. అయిదు నుంచి పది వరకూ అక్కడే చదువుకున్నా. నెలకోసారే అమ్మానాన్నల్ని చూడటానికి అవకాశమొచ్చేది. బాధగా అనిపించినా నేనిక్కడ చదువుకోవడం వల్ల నాన్నకు కష్టం తగ్గుతోందని ఉండిపోయేదాన్ని. పదో తరగతిలో స్కూల్ ఫస్ట్ రావడంతో శృంగరవపుకోటలోని ఓ ప్రైవేటు కళాశాల ఉచితంగా సీటిచ్చింది. అక్కడ కాలేజీలో మొదటి ర్యాంకు వచ్చింది. తరువాత డీఎడ్‌లో చేరి 2016లో పూర్తిచేశా. నా గురువుల మార్గదర్శకత్వంతోనే నేను బాగా చదువుకున్నా. అందుకే ఉపాధ్యాయురాలిని కావాలనుకున్నా. డీఎడ్ తరువాత ఓ వైపు డిగ్రీ పూర్తి చేస్తూనే డీఎస్సీ కోసం రోజులో 15 గంటలు చదివా. గతేడాది టెట్ పరీక్షల్లోను రాష్ట్రంలో మొదటి ర్యాంకు వచ్చింది. అంతే ఎట్టి పరిస్థితుల్లోను డీఎస్సీలోను ఎలాగైనా మొదటి ర్యాంకు సాధించాలనుకున్నా.

### నాన్నని శభాష్ అంటున్నారు

ఈరోజుల్లో పిల్లలంటే మీ పిల్లల్లా ఉండాలంటూ ఇప్పుడు నాన్నని అంతా పొగుడుతోంటే నేను పడిన కష్టమంతా దూదిపింజలా ఎగిరిపోయింది. అవును మరి ఇది నాన్న గెలుపే. అక్క బీటెక్ పూర్తిచేసింది. చెల్లి ఇంటర్‌లో ఉంది. మమ్మల్ని చదివించడం కోసమే రాత్రిపగలూ అనకుండా మిషన్ కుట్టిన సందర్భాలు నేను కళ్లారా చూశా. చేసిన అప్పులూ తెలుసు. 'నీ ప్రయాణం ఇక్కడితో ఆగొద్దు.. నువ్వు కలెక్టరు కావాలని' నాన్న ఇప్పుడు అంటున్నారు. టీచర్‌గా చేస్తూనే సివిల్స్‌లోను ర్యాంకు సాధించాలనుకుంటున్నా.

*-- జి.వి.వి.సత్యనారాయణరెడ్డి, ఈనాడు విజయనగరం*

# టెట్ టాపర్లు చెబుతున్నదేమిటి?

**మార్గదర్శకులు లేక... ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ వెనుకడుగు వేయక... పట్టుదలతో చదివిందో అభ్యర్థిని. ఇంటర్ వరకు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువు సాగించినా ప్రతిభకు ఇవేమీ ఆటంకం కాదంటూ నిరూపించాడో అభ్యర్థి. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో అత్యుత్తమ మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాల్లో నిలిచిన సి.భారతి, యాంద్ర సుబ్రహ్మణ్యంల ప్రిపరేషన్ తీరు గురించి తెలుసుకుందామా?**

## ప్రాక్టీస్ పరీక్షలే కీలకం



భారతి

మాది కర్నూలు. నాన్న పద్మాజీరావు, అమ్మ హేమ. ఇంటర్ పూర్తయ్యాక....2015-17 విద్యాసంవత్సరంలో డీఎడ్ కోర్సు పూర్తి చేశాను. ఉన్నత చదువులకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో ప్రస్తుతం దూరవిద్యలో తృతీయ సంవత్సరం చదువుతున్నా. ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లో పేపర్-1 పరీక్షలో పాల్గొని 150 మార్కులకు 141 మార్కులతో ప్రథమస్థానంలో నిలిచా!

సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికతో చదవటం ముఖ్యం. నగరంలోని ప్రతిభ అకాడమి శిక్షణ కేంద్రంలోని నిపుణుల సలహాల కారణంగా పోటీపరీక్షలో వేగంగా ఎలా సమాధానాలు రాయాలో అవగాహన చేసుకున్నా. ఉదయం, సాయంత్రం శిక్షణ పొంది ఇంటి దగ్గర పనులు చేసుకోవడం అలవాటు చేసుకున్నాను. బోధించిన అంశాలను కాసేపు పునశ్చరణ చేసునే దాన్ని. ఈవిధంగా ఆరు నెలలపాటు కష్టపడ్డా. ఆన్‌లైన్ పరీక్షల సాధన బాగా ఉపయోగపడింది. మూడు నెలల్లో 130కి పైగా ప్రాక్టీస్ పరీక్షల్లో పాల్గొన్నాను. రోజుకు కనీసం 10-11 గంటల పాటు పుస్తకాలతో గడిపితే చాలు, విజయం దానంతటదే వెతుక్కుంటూ వస్తుంది. మా కుటుంబంలో ఉన్నత చదువులు అభ్యసించినవారెవరూ లేక విద్యకు సంబంధించిన సూచనలు, సలహాలు కరువయ్యాయి. ఏవిధంగానైనా సివిల్స్‌లో రాణించి తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకురావాలని చిన్నతనంలోనే భావించాను. మొదట ఉపాధ్యాయ వృత్తిపై ఆసక్తి ఉండేది కాదు. ఇంటర్ పూర్తయ్యాక ఖాళీగా ఉండటం ఎందుకని డీఎడ్ కోర్సులో అడుగుపెట్టాక తెలిసింది... ఈ వృత్తి గొప్పతనం. చిన్ననాటి కలలను సాకారం చేసుకోవడానికి శ్రమిస్తాను. ఆ దిశగానే ప్రణాళికలు రూపొందించుకుని ప్రస్తుతం బోధనారంగం వైపు దృష్టి పెట్టా!

**- కర్నూలు విద్య,** న్యూస్‌టుడే

## సమయం విలువ గ్రహిస్తే సరి..



సుబ్రహ్మణ్యం

తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని వెలంపేట మా ఊరు. ఇంటర్ పూర్తిచేసి డిగ్రీ చదువుదామంటే ఆర్థికస్థోమత లేదు. ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తేగానీ కుటుంబంలో సమస్యలు తీరే పరిస్థితులు కనిపించడం లేదు. ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగుపెట్టాలని అహర్నిశలు శ్రమించాను. ఒకవైపు ఉపాధ్యాయశిక్షణ పూర్తిచేస్తూనే టెట్‌కు సంబంధించిన అంశాలను తెలుసుకుంటూ కొద్దిపాటి సమయం దొరికినా పోటీపరీక్షపైనే దృష్టిపెట్టాను. 'ఈనాడు' దినపత్రికలో ఉండే ప్రతిభ పేజీలు నాకు ఉపయోగపడ్డాయి. ఉన్న సమయాన్ని సద్వినియోగంచేసుకుంటూ కొద్దిపాటి సమయాన్ని పెంచుకున్నాను.

24 గంటల్లో నిద్రకు కనీసం 8 గంటలు పోతే 16 గంటలు మిగిలి ఉంటుంది. కనీసం 14 గంటలు అయినా కష్టపడి చదవాలనే నిర్ణయం తీసుకున్నాను. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12, 2 గంటల నుంచి సాయంత్రం 6, రాత్రి 8 గంటల నుంచి 11 గంటల వరకు 13 గంటలు పోటీపరీక్షపైనే దృష్టిసారించి పుస్తకాలతో కుస్తీపడ్డాను. రోజుకు మూడు గంటలపాటు రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు శిక్షణ కేంద్రంలో సందేహాలను నివృత్తి చేసుకుంటూ ముందుకుసాగాను. పోటీపరీక్షల అంశాలను తెలుసుకుంటున్న సమయంలో ఒక మార్కు కూడా పోకూడదనే పట్టుదల పెరిగింది. క్షణం కూడా వృథా చేయకుండా పోటీపడ్డాను. 141 మార్కులతో ప్రథమస్థానంలో నిలవగలిగాను.

**- న్యూస్‌టుడే,** సీతానగరం

# జీవితాన్ని, జీతాన్ని ఇచ్చిన చదువు

**మాది కృష్ణా జిల్లా నందివాడ మండలంలోని ఒక మారుమూల గ్రామం. మా తాత గారు కాలువల్లో చేపలు పట్టి ఊళ్లో అమ్మేవారు. ఉన్న గ్రామంలో బతుకుదెరువు కష్టం కావడంతో మా కోసం మా నాన్న విజయవాడ వచ్చి చిన్న చిన్న పనులు చేసేవారు. రోడ్లపై తిరుగుతూ ఇడ్లీలు అమ్మేవారు. తరువాత కొంత కాలానికి ప్రజాశక్తి దినపత్రికలో ఆఫీస్ బోయ్‌గా కుదిరారు. నేను పదవ తరగతిలో వుండగా ఆయనకు ఆకస్మికంగా ఆరోగ్యం క్షీణించి మంచాన పడ్డారు. కుటుంబ పరిస్థితుల కారణంగా మా నాన్న చేసే పనిలో నేను చేరాను.**



కృషి ఉంటే ఉన్న స్థానంలో నుంచి ఉన్నత స్థానానికి చేరుకోవొచ్చని; చదువూ, సాధనలను జంట దీపాలుగా వెంట పెట్టుకొని సమస్యల చీకట్లను అధిగమించవచ్చునని ఉదాహరణగా చూపే జీవితం బి.నాగరాజుది. అర్ధాంతరంగా ఆగిపోయిన చదువుని పట్టుదలతో సాగించాడు. కుటుంబంకోసం చిరుద్యోగం చేస్తూనే - చదువులో ఒక్కొక్క మెట్టూ ఎక్కాడు. ఉద్యోగం చేసే చోట ఖాళీ సమయాన్ని నైపుణ్యాన్ని, విజ్ఞానాన్ని పెంచుకోవటానికి ఉపయోగించుకున్నాడు. ఆఫీసు బాయ్ దశ నుంచి పిహెచ్‌డి స్కాలర్‌గా, అసిస్టెంటు ప్రొఫెసరుగా ఎదిగాడు. ఆయన ప్రస్థానాన్ని తన మాటల్లోనే విందాం.

విలేకరులు బస్సు ద్వారా పంపిన వార్తా కవర్లను బస్టాండుకు వెళ్లి అక్కడ బాక్స్ నుండి ప్రజాశక్తి కార్యాలయానికి తీసుకురావడం, కార్యాలయంలోని సిబ్బందికి టీలు, కాఫీలు తెచ్చి పోసివ్వడం నా పని. పనిలేని సమయంలో వార్తా పత్రికలు చదువుకుంటూ కూర్చునేవాడిని. కంప్యూటర్‌పై తెలుగు ప్రాక్టీసు చేస్తూ ఉండేవాడిని. ఏ మాత్రం ఖాళీ సమయం దొరికినా కంప్యూటర్‌ని వదిలేవాడిని కాదు. కృష్ణాజిల్లా డెస్క్ ఇన్‌ఛార్జి రామకృష్ణ, కంప్యూటర్ విభాగపు ఇన్‌ఛార్జి జె.వి.శ్రీనివాసరావు నన్ను కంప్యూటర్ నేర్చుకోమని ప్రోత్సహించారు. ఆఫీసు బోయ్‌గా రెండేళ్లు గడిచిపోయాయి.

చిన్నప్పటి నుండి మా నాన్న పడే కష్టాన్ని చూసి, బాగా చదువుకోవాలని, ఉన్నత స్థితికి వెళ్లాలని మనసులో బలంగా అనుకునేవాణ్ణి. ఆ కోరిక నన్ను ఇంటర్‌లో చేరేలా చేసింది. ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల సహాయంతో విజయవాడ ఎస్.ఆర్.ఆర్.అండ్ సి.వి.ఆర్. గవర్నమెంట్ కళాశాలలో ఇంటర్ చేరాను. పగలు కళాశాలకు వెళుతూ, రాత్రి ఆఫీసు బోయ్‌గా పనిచేసేవాడిని.

ఒకరోజు కృష్ణాజిల్లా డెస్క్ డిటిపి ఆపరేటర్ రాకపోవడంతో డెస్క్ ఇన్‌ఛార్జి నాతో వార్తలను టైప్ చేయించారు. ఒకటి, అర మినహా దాదాపు తప్పులు లేకుండానే టైప్ చేశాను. కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేయడానికి అన్నివిధాలా సరిపోతానని సిబ్బంది దృష్టిలో పడింది. అప్పటి ఎడిషన్ ఇన్‌ఛార్జి ఎస్.వెంకట్రావు గారి అనుమతితో తెలుగు టైపు పరీక్ష పెట్టారు. గంటకు మూడు వేల క్యారెక్టర్స్ టైప్ చేస్తే పాసైనట్లే. అయితే నేను ఏడు వేల క్యారెక్టర్ టైప్ చేశాను. దీంతో కృష్ణా జిల్లా డెస్క్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా నియమించారు. రోజూ వార్తలను టైప్ చేయడంవల్ల వాక్యాలను సరళంగా రాయడం, ఎడిటింగ్ చేయడం నేర్చుకున్నాను. దీంతో నన్ను కంప్యూటర్ ఆపరేటర్ నుండి సబ్ ఎడిటర్‌గా ప్రమోట్ చేశారు.

మరోపక్క ఇంటర్ పూర్తిచేసి అదే కళాశాలలో డిగ్రీ చేరాను. పగలు కళాశాలకు వెళుతూ, రాత్రి ప్రజాశక్తిలో పనిచేస్తూ డిగ్రీ కూడా పూర్తిచేశాను. ఇంకా ఉన్నత చదువులకు వెళ్లాలని మనసులో వున్నా ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ బాధ్యతలు నన్ను వెనక్కి నెట్టేస్తూ వుండేవి. మళ్లీ రెండు సంవత్సరాలు చదువు ఆపాల్సివచ్చింది. ఆ రెండేళ్లూ మా అమ్మానాన్నలకు తెలియకుండా ఆరువేల రూపాయలు దాచిపెట్టాను.

నేను ఉద్యోగం మానేసి ఎం.ఎ.(ఇంగ్లీషు) చదువుతానని మా అమ్మానాన్నలకు చెబితే వారు షాక్‌కు గురయ్యారు. నా ఆర్థిక పరిస్థితి చూసి రామకృష్ణ గారు ఉద్యోగం మానవద్దని వారించారు.

'అసలే ఇల్లు గడవడం కష్టంగా వుంది. నాన్న మంచాన ఉన్నారు. నువ్వు తెచ్చే ఆదాయంతోనే ఇల్లు గడపగలుగుతున్నావు. ఈ పని మానేసి చదువుకుంటే, ఇల్లు ఎలా గడుస్తుంది?' ఉద్యోగం మానొద్దని హితవు పలికారు. తెలిసినవారంతా కుటుంబానికి బతుకుదెరువేంటని ప్రశ్నించారు.

ఈ చిన్న జీవితానికి చదువు కోవడం ఇంత కష్టమైపోయిందా అనిపించింది. ఎంతమంది ఎన్ని ప్రశ్నలు వేసినా మనస్సు మాత్రం 'చదువే నీ జీవితం' అని సమాధానం చెప్పింది.

ఉద్యోగం వదిలేసి జీవితంలో పెద్ద సాహసమే చేయాల్సి వచ్చింది. దాచుకున్న ఆరువేల రూపాయలతో విజయవాడ పి.బి.సిద్ధార్థ కళాశాలలో ఎం.ఎ.(ఇంగ్లీషు)లో చేరాను. కుటుంబ అవసరాల కోసం తెలిసినచోటల్లా అమ్మ అప్పు తెచ్చింది. ఎం.ఎ. ఆఖరి సంవత్సరంలో వుండగా మరో పెద్ద అవాంతరం జీవితాన్ని కుదిపేసింది. పాన్‌క్రియాటిక్ (క్లోమగ్రంధి)ఇన్‌ఫెక్షన్ రావడంతో దాదాపు 15 రోజులు హాస్పిటల్‌లో ఉంచారు. తిండి లేకుండా 15 రోజులు సెలైన్లు, మందులపైనే హాస్పిటల్‌లో వుంచడంతో శరీరంలో శక్తి అంతా పోయి, బతుకుతానో, లేదో అనే అనుమానం కలిగింది.

'సాగిపోవడమే జీవితం, ఆగిపోవడమే మరణం' అని ఎవరో మహానుభావుని మాటలు గుర్తొచ్చాయి. సత్తువంతా కూడగట్టుకొని మళ్లీ జీవితాన్ని గాడినపెట్టాను. ఎం.ఎ. ఇంగ్లీషు పూర్తిచేసిన తర్వాత చదువుపై ఉన్న ఆసక్తి వల్ల ఉపాధ్యాయ వృత్తిపై నా దృష్టి మళ్లింది. ఉపాధ్యాయ వృత్తిలో నిరంతరం జ్ఞాన సముపార్జన చేసే అవకాశం ఉంటుంది. ఎంతో మంది యంగ్‌మైండ్స్‌కి జ్ఞాన సంపాదన ప్రాముఖ్యాన్ని తెలిపే అవకాశం దక్కుతుంది. ఆ ఉద్దేశంతో ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడాలని నిశ్చయించుకున్నాను. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం తెచ్చుకోగలిగాను. ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన తర్వాత ఈ రంగంలో మెళకువలు తెలుసుకోవడానికి, విద్యార్థులకు ఆసక్తిగా పాఠ్యాంశాలు చెప్పడానికి ఎంతో సాధన చేసేవాడిని. కళాశాలలో పనివేళలు అయిన తర్వాత పుస్తకాలు ముందువేసుకొని రాత్రి 11, 12 గంటల వరకు సమయం తెలియకుండా చదువుతుండేవాడిని. ఏరోజైనా వార్తాపత్రిక, పుస్తకాలు చదవకపోతే, ఆ రోజు నాకు అసంపూర్తిగా వుండేది.

2014లో ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో ఎం.ఫిల్ పూర్తిచేశాను. తర్వాత అదే విశ్వవిద్యాలయంలో పిహెచ్.డి.లో చేరి అభివృద్ధి చెందుతున్న దేశాలపై తెల్లవారి వలస వాదం (కలోనియలిజం) అనే అంశంపై పరిశోధన చేసి, పరిశోధనా గ్రంథాన్ని (థీసిస్) సమర్పించాను. 2022లో ఎ.పి.సెట్ (ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్)లో, 2023లో టి.ఎస్.సెట్ (తెలంగాణా స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్)లో అర్హత సాధించాను.

జీవితం అల్లకల్లోలమైనా, అనుకోని అవాంతరాలు బతుకుబండిని తలకిందులు చేసినా మెట్టు మెట్టు పేర్చుకుంటూ అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలగడం నా జీవితానికి సంతృప్తినిచ్చింది. ఎన్ని సమస్యలు ఎదురైనా, పనే పరమాత్మ అనే భావనతో కష్టించడం నాకు ఆనందాన్ని ఇచ్చింది.

నా ఈ చిన్న జీవన ప్రయాణంలో చదువు నాకు జీవిత సత్యాన్ని, పరమార్థాన్ని తెలిపితే, ఎందరో మహానుభావులు తమ వంతు చేయూతనిచ్చి ఈ సమాజంపై నా మనస్సులో ప్రగాఢమైన కృతజ్ఞతా భావాన్ని నెలకొల్పారు. ఈ సమాజానికి నేను ఎంతో రుణపడి వున్నాను.


- **బి.నాగరాజు**, ఎం.ఎ. ఎం.ఫిల్. (పిహెచ్.డి).

అసిస్టెంట్ ప్రొఫెసర్ ఇంగ్లీష్ విభాగం

గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల, కృష్ణా జిల్లా.

సెల్ : 99597 06703


## అత్యుత్తమ ఉద్యోగుల లక్షణాలివీ..



1.నైపుణ్యాలను నిరంతరం మెరుగుపర్చు కుంటారు. 2.సమస్యలకు సాధ్యమైనన్ని ఎక్కువ పరిష్కారాలను కనుగొంటారు. 3.తప్పులకు బాధ్యత తీసుకుంటారు. 4.సహచరుల పురోగతికి సహకారం అందిస్తారు. 5.సమయాన్ని, శక్తిని ముఖ్యమైన విషయాలకే కేటాయిస్తారు. 6.హోదాతో సంబంధం లేకుండా బృందసభ్యులను సమానంగా చూస్తారు. 7.ఆలోచనలను, అవకాశాలను స్వీకరించడానికి సదా సిద్ధంగా ఉంటారు. 8.పనితీరు, వ్యక్తిత్వంతో ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారు.

– క్రిస్ డోన్లీ, పర్సనల్ గ్రోత్ కోచ్

## సవాళ్లన్నీ ప్రతిబంధకాలు కావు



మీ జీవిత గమనంలో ఎదురయ్యే సవాళ్లన్నీ మీకు ప్రతిబంధకాలు కావు. అవి మీ నైపుణ్యాలకు పెట్టే పరీక్షలు. అంతేకాదు.. ఆ సవాళ్ల వెనుక అవకాశాలు దాగి ఉంటాయని తెలుసుకోవాలి. ఆ సవాళ్లను అధిగమించితేనే అవకాశాలు వరిస్తాయి. అలాంటివారే విజేతలుగా నిలుస్తారు. సవాళ్లను సమస్యలుగా చూసి భయపడేవారు ఎప్పటికీ అవకాశాలను దక్కించుకోలేక పరాజితులుగా మిగిలిపోతారు.

– అమీ పెచాసెక్, లీడర్షిప్ మెంటార్

# మూస చదువులు మారాలి



**భారత రెండో రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా నేడు జాతి మొత్తం ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకొంటోంది. సమాజంలో ఉపాధ్యాయుడికి ఉన్న స్థానం వెలకట్టలేనిది. విద్యార్థుల జీవితంలో కీలకపాత్ర పోషించే టీచర్లు ఎంతో బాధ్యతగా ఉండాలి. ముఖ్యంగా, ఉపాధ్యాయ విద్యాసంస్థలను సంస్కరించాల్సిన ఆవశ్యకత నేడు ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.**

చిన్నతనంలో ప్రతి బాలుడు బాలిక ఎక్కువగా అనుకరించే ప్రయత్నం చేసేది ఉపాధ్యాయుడినే. వ్యక్తి జీవితంలో ప్రభావవంతమైన గౌరవ స్థానం ఉన్న ఉపాధ్యాయుడు కూడా వంకపెట్టలేని విధంగా ఉండాలి. దేశం మొత్తం మీద పదిహేడు వేల పైచిలుకు ఉపాధ్యాయ విద్యాసంస్థలు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఇవి సుమారు వెయ్యి వరకు కొలువుతీరాయి. ఈ సంస్థలు అందించే ఉపాధ్యాయ విద్యలో నాణ్యత నానాటికీ తీసికట్టుగా మారుతోంది. దేశంలోని సింహభాగం టీచర్ ట్రైనింగ్ సంస్థలు నాసిరకం విద్యను అందిస్తున్నాయని ఉపాధ్యాయ విద్యను సంస్కరించే ఉద్దేశంతో 2012లో ఏర్పాటైన జస్టిస్ జె.ఎస్.వర్మ కమిటీ కుండ బద్దలుకొట్టింది. నమోదైన సంస్థల్లో 20శాతం కేవలం కాగితాలకే పరిమితమైనట్లు ఆ కమిటీ వెల్లడించింది. చాలా సంస్థలకు అనుబంధ పాఠశాలలు లేవు. వాటిలో బోధించే అధ్యాపకులకు జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సీటీఈ) నిర్ధారించిన అర్హత ప్రమాణాలు లేవు. ఈ క్రమంలో భవిష్యత్తు తరాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయ విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఉపాధ్యాయులను తీర్చిదిద్దే సంస్థలను సంస్కరించి, బలోపేతం చేయాలని జాతీయ విద్యావిధానం-2020 ఉద్ఘాటించింది.

## తనిఖీలు కీలకం

దేశీయంగా ఉన్న మొత్తం ఉపాధ్యాయ శిక్షణ సంస్థల్లో 90శాతం ప్రధానంగా టీచర్ ట్రైనింగ్‌పైనే దృష్టి సారిస్తున్నాయి. ఇలాంటి వాటిని స్టాండ్‌ఎలోన్ సంస్థలంటారు. వీటిలో నాణ్యతను పెంచాలంటే బహుళ, వినూత్న కోర్సులు అందించే విద్యాసంస్థలుగా వాటిని మార్చాలని నూతన జాతీయ విద్యావిధానం సూచించింది. ఉపాధ్యాయ విద్య బలోపేతం కావాలంటే 2030 నాటికి స్టాండ్‌ఎలోన్ సంస్థల గుర్తింపును రద్దు చేయాలని లేదా అవి బహుళ కోర్సుల సంస్థలుగా మారాలని ఉద్ఘాటించింది. ఈ దిశగా సరైన కార్యాచరణ కనిపించడం లేదు. గతంలో ఒక సంవత్సర కాలపరిమితి ఉన్న బి.ఎడ్ విద్యను రెండేళ్లకు పెంచారు. దానివల్ల నాణ్యత పెద్దగా పెరగలేదు. ఈ క్రమంలో ఇకపై విశ్వవిద్యాలయాలు ఉపాధ్యాయ విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని, అందుకోసం వాటిలో ప్రత్యేక విభాగాలు లేదా కళాశాలలను ప్రారంభించాలని నూతన విద్యావిధానం సూచించింది. ఈ విషయంలో వ్యవస్థాగతంగా సరైన మార్పులు కొరవడ్డాయి.

ఉపాధ్యాయులను ఉత్తమంగా తీర్చిదిద్దాలంటే కొన్ని కఠిన నిర్ణయాలను తీసుకోక తప్పదు. తొలుత ఉపాధ్యాయ విద్యను అందించే సంస్థలకు అనుబంధంగా పాఠశాల ఉండటాన్ని తప్పనిసరి చేయాలి. ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టి ప్రమాణాలు పాటించని వాటి గుర్తింపును రద్దు చేయాలి. ఈ విషయంలో ఎన్‌సీటీఈ, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికను రూపొందించి పటిష్ఠంగా అమలుచేయాలి. నిబంధనల అమలు పరంగా ఎన్‌సీటీఈ పనితీరు ఆశాజనకంగా లేదని గత అనుభవాలు చాటుతున్నాయి. కొన్ని సందర్భాల్లో రాష్ట్రాల చర్యలను అది నీరుగార్చిన ఉదంతాలు సైతం ఉన్నాయి. ఇలాంటి విమర్శలకు ఆస్కారం లేకుండా ఎన్‌సీటీఈ సమర్థంగా పనిచేయాలి.

## ఆసక్తి ఉంటేనే...

పాఠశాల విద్యను పటిష్ఠం చేయడానికి తీసుకొస్తున్న సంస్కరణలకు అనుగుణంగా ఉపాధ్యాయ విద్యను తీర్చిదిద్దడం మరో ప్రధాన అంశం. ఈ రెండు వ్యవస్థల అవినాభావ సంబంధాన్ని బలోపేతం చేసే ఎలాంటి చర్యలనూ ఇప్పటిదాకా తీసుకోలేదు. ప్రాథమిక స్థాయిలో విద్యారంగాన్ని సుదృఢం చేయడంలో ఇది కీలకంగా నిలుస్తుంది. అన్నింటికంటే ముఖ్యమైన అంశం ఉపాధ్యాయుల ఎంపిక, శిక్షణకు సంబంధించింది. డీఎస్‌సీల ద్వారా ఉపాధ్యాయులను ఎంపిక చేయడం ఎంత వరకు సబబనే విషయంపైనా కూలంకష చర్చ జరగాలి. ఉపాధ్యాయ నియామకం అభ్యర్థుల ఆసక్తిని బట్టి జరగాలి. కేవలం అర్హతల ఆధారంగానే వారి ఎంపిక ఉండకూడదన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఉపాధ్యాయ వృత్తిపై పూర్తిస్థాయి ఆసక్తి ఉన్నవారు ఎవరన్నది తేల్చడం కష్టమే. అయినా, దేశవ్యాప్తంగా ఇలాంటివారిని గుర్తించడానికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించవచ్చు. ఇంతవరకు ప్రభుత్వరంగంలో, విశ్వవిద్యాలయాల అనుబంధ సంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయుల గురించే మొత్తం చర్చ సాగింది. ప్రైవేటు పాఠశాలల్లో నియమితులవుతున్న ఉపాధ్యాయులు, వారి అర్హతలను గుర్తించి క్రమబద్ధీకరించే ఏర్పాటు లేదు. జిల్లా విద్యాధికారుల పర్యవేక్షణ పరిమితంగానే ఉంది. ఈ పరిస్థితి మారాలి. దేశంలో ఉపాధ్యాయ వృత్తిపై ఎనలేని ప్రేమ, గౌరవ భావం, నిజాయతీ కలిగిన వారికి నియామకాల్లో ప్రాధాన్యం దక్కాల్సిన సమయం ఆసన్నమైంది. వీలైనంత వేగంగా ఈ కల నెరవేరుతుందని ఆశిద్దాం.

### జాతీయ విద్యావిధానం సూచనలు

- ఫ్రాయిడ్ వంటి మానసిక శాస్త్రవేత్తల అధ్యయనాలను పరిగణనలోకి తీసుకుని చిన్నారులకు మూడు నుంచి ఆరేళ్లలోపే వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన విద్యపై శ్రద్ధ వహించాలి.
- అంగన్‌వాడీలు, శిశువిద్యాకేంద్రాలను పటిష్ఠం చేయాలి.
- ప్రాథమిక బాల్యదశలోని విద్యకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించాలి.
- బాల్యంలో విద్యాభ్యాసం అన్నది ఆటలు ఆడుకున్నంత ఆసక్తికరంగా ఉండాలి. దీనికి తగినట్లుగా ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఉండాలి.



ఆచార్య కోదాటి వియ్యన్నరావు
పూర్వ ఉపకులపతి,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

# డిటెన్షన్ విధానం సరికాదు

**2009** విద్యా హక్కు చట్టాన్ని సవరిస్తూ, కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు అమలులో ఉన్న నో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేస్తూ 5, 8 తరగతుల విద్యార్థులకు డిటెన్షన్ విధానం తీసుకువచ్చింది. ఈ విధానం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న మూడు వేల కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు, సైనిక పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలులోకి రానుంది.

విద్యా హక్కు చట్టం 2009లోని సెక్షన్ 16 ప్రకారం ప్రాథమికోన్నత పాఠశాల స్థాయిలో 8వ తరగతి వరకు ఏ విద్యార్థినీ కూడా అదే తరగతిలో మళ్ళీ కొనసాగించేందుకు లేదా పాఠశాల నుంచి తొలగించేందుకు వీలులేదు. దీనినే నో డిటెన్షన్ విధానం అంటారు. పరీక్షలలో ఉత్తీర్ణతతో సంబంధం లేకుండా విద్యార్థులు పై తరగతులకు వెడతారు. ప్రాథమిక స్థాయిలో పిల్లల ఎన్‌రోల్‌మెంట్ పెంచడం, ఆహ్లాదకరమైన అభ్యసనం, పరీక్షల పట్ల భయం తగ్గించడం, డ్రాప్ ఔట్స్ కాకుండా చూడటం నో డిటెన్షన్ పాలసీ ప్రధాన లక్ష్యాలు.

అయితే ఈ విధానం వల్ల ఆశించిన ఫలితాలు రావడం లేదని నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే, అసెర్ నివేదికలు తేలుస్తున్నాయి. విద్యార్థులలో అభ్యసన పట్ల శ్రద్ధ తగ్గిందని, ఫలితాలకు ప్రాధాన్యత లేకపోవడం వల్ల ఉపాధ్యాయులు బోధనపై దృష్టి సారించడం లేదని విమర్శకుల వాదన. అదే విధంగా 9, 10 తరగతుల్లో డ్రాప్ ఔట్స్ అధికం అవుతున్నాయని వీరి విమర్శ. ప్రాథమిక స్థాయిలో 100 శాతం ఎన్‌రోల్‌మెంట్ ఉండగా, 9, 10 తరగతుల్లో డ్రాప్ ఔట్ శాతం 17గా ఉండటం గమనార్హం.

నో డిటెన్షన్ విధానం వల్ల అభ్యసన సామర్థ్యాలు తగ్గుతున్నాయని, దానిని మార్చవలసిందిగా వివిధ రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విజ్ఞప్తులు అందాయి. దేశంలో 23 రాష్ట్రాలు డిటెన్షన్ విధానాన్ని తీసుకురావాలని ప్రతిపాదించాయి. 2018లో విద్యా హక్కు చట్టానికి సవరణలు తెచ్చాక 16 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో డిటెన్షన్ విధానం అమలులోకి వచ్చింది. అయితే ఉభయ తెలుగు రాష్ట్రాలు నో డిటెన్షన్ విధానమే కొనసాగిస్తున్నాయి. మరి కొన్ని రాష్ట్రాలు ఏ నిర్ణయమూ తీసుకోలేదు.

నూతన విధానం ప్రకారం 5, 8వ తరగతి విద్యార్థులు సంవత్సరాంతంలో నిర్వహించే పరీక్షల్లో ఖచ్చితంగా ఉత్తీర్ణులు కావాలి. ఉత్తీర్ణత సాధించని వారికి రెండు నెలల పాటు శిక్షణ అందించి, మళ్ళీ పరీక్ష నిర్వహిస్తారు. ఇందుకోసం ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. రెండవసారి కూడా ఉత్తీర్ణత సాధించకుంటే అదే తరగతిలో కొనసాగిస్తారు. అదే తరగతిలో కొనసాగించినపుడు విద్యార్థి అభ్యసన లోపాలు గమనించి వాటిని పూర్తి చేసేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలి. 8వ తరగతి పూర్తి చేయకుండా ఏ విద్యార్థినీ బడిలో నుంచి తొలగించరాదని కేంద్ర ప్రభుత్వం గెజిట్‌లో పేర్కొంది. అందరికీ విద్య అందాలి, కానీ అదే సమయంలో విద్యార్థులు ఆశించిన సామర్థ్యాలు పొందేందుకు నూతన విధానం దోహదపడుతుందని, అభ్యసనలో వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించేందుకు ఈ విధానం ఉపయుక్తంగా ఉంటుందని కేంద్రం వాదన.

కానీ డిటెన్షన్ విధానం తిరోగాత్మక చర్యగా విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులు ప్రాథమిక విద్యకు కూడా దూరమయ్యే అవకాశాలు ఉన్నాయని విద్యాహక్కు చట్టం ఉద్యమకారులు వాదిస్తున్నారు. డిటెన్షన్ విధానం వల్ల పిల్లల్లో పరీక్షల పట్ల భయం పెరిగే అవకాశం ఉంది. ఫెయిల్ అయిన విద్యార్థులు బడికి దూరమయ్యే ప్రమాదం ఉంది. వారిలో న్యూనతాభావం ఏర్పడుతుంది. మళ్ళీ అదే తరగతి చదవాల్సి రావటం వారిలో నిరాసక్తతను పెంచుతుంది. బాలకార్మికులు పెరిగే ప్రమాదం ఉంది. డిటెన్షన్‌ను అధిగమించేందుకు పరీక్షలలో అనైతిక విధానాలకు పాల్పడే అవకాశం ఉంది. ప్రాథమిక స్థాయిలో ఆహ్లాదంగా జరగాల్సిన అభ్యసనం ఆందోళనాయుతంగా ఉంటుంది. డిటెన్షన్ విద్యావిధానం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులపై, మొదటి తరం అభ్యాసకులపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిపుణుల అభిప్రాయం.

నో డిటెన్షన్ విధానంలో ఉన్న లోపాలను అధిగమించేందుకు విద్యావ్యవస్థలో అవసరమైన మార్పులు తీసుకురావాలి. విద్యార్థుల అభ్యసనం, ఉపాధ్యాయుల బోధన అభివృద్ధిచెందేందుకు పర్యవేక్షణ ఉండాలి. అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. పరీక్షా విధానంలో సంస్కరణలు తీసుకురావాలి. నేర్చుకోవడానికి ఇబ్బంది పడుతున్న విద్యార్థులకు ప్రోత్సాహం అందించకుండా, డిటెన్షన్ ద్వారా అవరోధాలు సృష్టించడం వారిని శాశ్వతంగా విద్యకు దూరం చేస్తుంది. అందుకని డిటెన్షన్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం పునః సమీక్షించాలి.

**— డాక్టర్ అనుమాండ్ల వేణుగోపాలరెడ్డి**

# సంస్కరణలకు సిద్ధమేనా?

**విశ్వవిద్యాలయాల నిధుల సంఘం(యూజీసీ) ఇటీవల యూజీ, పీజీ కోర్సులకు సంబంధించి 'కనీస బోధన ప్రమాణాల ముసాయిదా నిబంధనలు-2024' తీసుకొచ్చింది. వాటి ప్రకారం, ఉన్నత విద్యాసంస్థలు ఏటా రెండుసార్లు వివిధ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించడం వీలవుతుంది. ఆయా కోర్సుల్లో విద్యార్థులకు మల్టిపుల్ ఎంట్రీ, మల్టిపుల్ ఎగ్జిట్ అవకాశాలు ఇవ్వడం వంటి మరెన్నో మార్పుల్ని ఈ ముసాయిదాపత్రం ప్రతిపాదించింది. అయితే, వీటి అమలులో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడం అత్యావశ్యకం.**

దేశంలోని అనేక విద్యాసంస్థలు అధ్యాపకుల లేమితో పాటు వసతులు, తరగతి గదులు, ప్రయోగశాలల కొరతతో నెట్టుకొస్తున్నాయి. విద్యా ప్రమాణాల్లోనూ వెనకబడిపోయాయి. ఇటువంటి పరిస్థితుల్లో యూజీసీ 'కనీస బోధన ప్రమాణాల ముసాయిదా నిబంధనలు-2024' అమలుచేయడం అంత సులభమేమీ కాదు. ముఖ్యంగా అధ్యాపకులను పూర్తిస్థాయిలో నియమించకుండా ఏటా రెండుసార్లు ప్రవేశాలు కల్పిస్తే, వారిపై పనిభారం పెరిగి బోధన కుంటుపడే ప్రమాదముంటుంది. ప్రస్తుతం చాలా ఉన్నత విద్యాసంస్థల్లో జులై/ఆగస్టు అడ్మిషన్లలో అధిక సంఖ్యలో సీట్లు మిగిలిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో జనవరి/ఫిబ్రవరి అడ్మిషన్లకు అభ్యర్థులు అందుబాటులో ఉండకపోవచ్చు. రెండుసార్లు అడ్మిషన్లను అమలు చేయడానికి ముందు విద్యాసంస్థల్లో మౌలిక వసతులను మెరుగుపరచి, పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాల్సిన అవసరముంది.



## మంచివే కానీ...

యూజీసీ ప్రతిపాదనల్లో మరో ముఖ్యమైన అంశం- ఇంటర్, డిగ్రీలో చదివిన సబ్జెక్టులతో సంబంధం లేకపోయినాసరే, ఏ విద్యార్థి అయినా తనకు నచ్చిన ఇతర అంశాల్లో జాతీయస్థాయి లేదా విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించి డిగ్రీ, పీజీ కోర్సుల్లో చేరవచ్చు. ఇది చాలామంది విద్యార్థులు ఇష్టమైన సబ్జెక్టులు చదవడానికి అవకాశం కల్పిస్తుంది. కానీ, అలా అభ్యసించే సబ్జెక్టులో కొందరు విద్యార్థులకు ప్రాథమిక అవగాహన లేకపోవడం వల్ల వారితో పాటు అధ్యాపకులకూ సవాళ్లు ఎదురవుతాయి. కాబట్టి, ఇటువంటి ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించడానికి నిర్ణీత మార్కులను నిర్దేశించాల్సిన అవసరముంది. ఒకే తరగతి గదిలో కిందిస్థాయిలో ఆ సబ్జెక్టు చదివినవారు, చదవనివారు కలిసి ఉండటంవల్ల బోధన విధానంలో చాలా మార్పులు అవసరమవుతాయి. దిగువ స్థాయిలో ఆ సబ్జెక్టు చదవనివారి కోసం బ్రిడ్జ్ కోర్సులు నిర్వహించాలి. అందుకోసం అదనంగా అధ్యాపకులను, లేదంటే బోధనా సహాయకుల్ని నియమించుకోవాల్సి ఉంటుంది.

యూజీసీ మార్గదర్శకాలు, కరికులం, క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్‌ను అనుసరించి ఒక విద్యార్థి ఏకకాలంలో రెండు యూజీ లేదా పీజీ కోర్సులు చదివే అవకాశం ఉంటుంది. దానికీ ఆచరణలో అనేక ఇబ్బందులు ఎదురవుతాయి. ఒకే సమయంలో రెండు కోర్సులకు పరీక్షలు రాయాల్సి వస్తే విద్యార్థులకు అగచాట్లు తప్పవు. జాతీయ విద్యావిధానం-2020 సూచించిన భిన్న అభ్యాసన పద్ధతులను అనుసరించి వివిధ కోర్సుల్లో పరీక్షలు రాయడానికి కనీస హాజరు అవసరం. కొవిడ్-19 తరవాత చాలామంది విద్యార్థులు రోజూ కాలేజీలకు రావడానికి విముఖత చూపిస్తున్నారు. అలాంటప్పుడు ఒక విద్యార్థి ఒకే సమయంలో రెండు కోర్సులు చదివితే హాజరుశాతం మరింతగా తగ్గుతుంది. విద్యార్థుల హాజరును పెంచడానికి బోధన, అభ్యాసన పద్ధతుల్లో సృజనాత్మకత, సాంకేతికత చాలా అవసరం. ఇరవై ఒకటో శతాబ్దపు యువతకు పందొమ్మిదో శతాబ్దపు పద్ధతులతో బోధిస్తే హాజరు శాతం, ఉన్నతవిద్యపై ఆసక్తి మరింతగా సన్నగిల్లుతాయి. పరీక్షల నిర్వహణ, మూల్యాంకనానికి సంబంధించి యూజీసీ, ఇతర సంస్థలు ఎప్పటికప్పుడు ఆదేశాలు, మార్గదర్శకాలు జారీ చేస్తుంటాయి. రాత పరీక్షలే కాకుండా సెమినార్లు, ప్రెజెంటేషన్లు, తరగతిలో పనితీరు, ప్రాజెక్టు వర్క్ వంటి వాటికి వెయిటేజీ ఇవ్వాల్సి ఉంటుంది. గతంలో తీసుకొచ్చిన ఇటువంటి సంస్కరణలేవీ సరిగ్గా అమలు కాలేదు. వీటిని పక్కాగా అమలు చేయడానికి పటిష్ఠ ప్రణాళిక అవసరం. తాజా ముసాయిదా నిబంధనల్లో ఏడాది వ్యవధిగల యూజీ సర్టిఫికెట్, రెండేళ్ల యూజీ డిప్లొమా, మూడేళ్ల యూజీ డిగ్రీ, నాలుగేళ్ల యూజీ(ఆనర్స్), అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ పీజీ, ఒకటిరెండు సంవత్సరాల పీజీ ప్రోగ్రాములకు సంబంధించి మొత్తం క్రెడిట్ల సంఖ్యను పేర్కొన్నారు. విద్యార్థులు ఏదైనా ఒక ప్రధాన సబ్జెక్టుతో ప్రోగ్రాం పూర్తిచేసినట్లు ధ్రువపత్రం పొందాలంటే, మొత్తం క్రెడిట్లలో కనీసం సగం ఆ అంశంలోనే ఉండాలి. మిగతా సగం క్రెడిట్లకు నైపుణ్యాలు, అప్రెంటిస్‌షిప్, మల్టీ డిసిప్లీనరీ సబ్జెక్టులను ఎంపిక చేసుకోవచ్చు.


## అధ్యాపకుల కొరత

నేషనల్ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ నిర్ణీత గడువుకంటే ముందుగా, లేదంటే ఆలస్యంగా యూజీ పూర్తిచేయడానికి వీలు కల్పిస్తోంది. దీని కింద ఉన్నత విద్యాసంస్థలు ప్రామాణిక వ్యవధితో పాటు యాక్సిలరేటెడ్ డిగ్రీ ప్రోగ్రాం(ఏడీపీ), ఎక్స్‌టెండెడ్ డిగ్రీ ప్రోగ్రాం(ఈడీపీ)లను అందిస్తాయి. వ్యవధిని బట్టి ప్రతి సెమిస్టర్‌లో క్రెడిట్ల సంఖ్యను తగ్గించడం లేదా పెంచడం చేస్తారు. ఈ డిగ్రీలను ప్రామాణిక డిగ్రీలతో సమానంగానే పరిగణిస్తారు. ఏడీపీ, ఈడీపీ పూర్తిస్థాయిలో అమలు కావాలంటే ద్వైవార్షిక ప్రవేశాలు తప్పనిసరి. విద్యార్థులు త్వరగా క్రెడిట్లు పూర్తిచేయడానికి వీలుగా ప్రతి సెమిస్టర్‌లో ఎక్కువ ఆప్షనల్ సబ్జెక్టుల్ని అందుబాటులో ఉంచాలి. ఏడీపీ విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించడానికి బోధనా సహాయకుల్ని నియమించాలి. విద్యా ప్రమాణాలు పడిపోకుండా ఇప్పుడున్న అధ్యాపకుల సంఖ్యను కనీసం 50శాతం పెంచుకోవాల్సి ఉంటుంది. తరగతి గదులు, ప్రయోగశాలలు రెట్టింపు సంఖ్యలో అవసరమవుతాయి. మరోవైపు ఏడీపీ, ఈడీపీ విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి అకడమిక్ కౌన్సిలర్లను పెద్ద సంఖ్యలో నియమించాలి. బోధన రుసుమును విద్యార్థి తీసుకునే క్రెడిట్ల సంఖ్యను బట్టి నిర్ణయించాల్సి ఉంటుంది. ఈడీపీలో చదివే విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్, పొడిగించిన కాలానికి ఉపకార వేతనాలు, హాస్టల్ వసతి కొనసాగించాలి. ఉన్నత విద్యలో విద్యార్థులకు నైపుణ్యాలు నేర్పకుండా, ఉపాధి అవకాశాలను ఒడిసిపట్టడానికి అవసరమైన డిగ్రీలను అందించకుండా ఉంటే- ఎన్ని సంస్కరణలు తీసుకొచ్చినా నిష్ప్రయోజనమే అవుతుంది.



ప్రొఫెసర్ బి.రాజశేఖర్
సీనియర్ ఆచార్యులు,
హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం

# " విద్యాదానం మహాదానం "




- "దక్షిణాఫ్రికాలో ఒక యూనివర్శిటీ ప్రవేశ ద్వారం వద్ద ఇలా వ్రాయబడి ఉంది. ఒక దేశాన్ని నాశనం చేయాలంటే మిస్సైల్స్ కానీ, అనుబాంబులు కానీ అవసరం లేదు. నాసిరకం విద్య విద్యార్థుల్ని పరీక్షల్లో కాపీ కొట్టనివ్వడంతో లాంటి విధానాన్ని ప్రోత్సహిస్తే భవిష్యత్తులో ఆ దేశం దాననంతట అదే నాశనం అవుతుంది."
- అలా చదివిన డాక్టర్స్ చేతిలో రోగులు చనిపోతారు.
- అలా చదివిన ఇంజనీర్ల చేతిలో కట్టడాలు కూలిపోతాయి.
- అలా చదివిన ఆర్థికవేత్తల చేతిలో ద్రవ్యం నష్టపోతుంది.
- అలా చదివిన సంఘ సంస్కర్తల చేతిలో న్యాయం అన్యాయంగా మారిపోతుంది.
- ఏ దేశంలో విద్య నాశనం చేయబడుతుంతో ఆ దేశం పతనావస్తకు చేరుకుంటుంది.
- విద్య విజ్ఞానం కోసమే కానీ వ్యాపారం కోసం కాదు... అని వ్రాయబడింది.
- అందుకు... సంఘంలోని స్త్రీ పురుషులందరినీ విద్యావంతులను చేయడమే మన కర్తవ్యం.
- తద్వారా... ఏది మేలో ఏది కీడో తెలుసుకునే శక్తి వారికి కలుగుతుంది.
- అప్పుడు... వారు తమంతట తామే తమ చెడులను తొలగించుకుంటారు.
- అప్పుడు మనం బలవంతంగా సంఘంలో దేన్నీ రూపుమాపాల్సిన పని ఉండదు.
- దేన్ని బలవంతంగా సమాజంపై రుద్దవలసిన అవసరం ఉండదు అంటారు -స్వామి వివేకానంద.
- అన్నదానము గొప్పదనవచ్చు కానీ అన్నంబు జాములో నరిగిపోవు.
- వస్త్రదానము కూడా భవ్యదానమే కానీ వస్త్రమేడాదిలో పాతదగును.
- గృహదానమొక్కటి యుత్కృష్ట దానమే కాని కొంప కొన్నేండ్లలో కూలిపోవు.
- భూదానము, మహాపుణ్యదానమే కానీ, భూమి యన్యుల జేరిపోవచ్చు.
- అరిగిపోక, ఇంచుక మేని చెరిగిపోక, కూలిపోక, అన్యులపాలు గాక నిత్యమై, నిర్మలమై, నిశ్చలమై మొప్పుచుండు. విద్యాదానమొకటే జగతి అంటారు -చిలకమర్తి నరసింహం.
- అన్ని దానములలో కల్ల విద్యాదానం గొప్పది. "విద్యాదానం మహా గొప్పదానం". ఒక జ్ఞానజ్యోతి, కోటి జ్ఞానజ్యోతులను వెలిగిస్తుంది.
- ఒక మంచి ఆలోచన లక్షలాదిమందిని కదిలిస్తుంది. ఒక సిరాచుక్క లక్షలాది మందిలో కదలికను తెచ్చి ఒక మంచి సమాజాన్ని నడిపిస్తుంది అంటారు -స్వామి వివేకానంద.
- "బానిసత్వాన్ని అంతమొందించగల పరమాయుధం విద్య. అణగారిన ప్రజానీకాన్ని తట్టిలేపి, సామాజిక హూదాను ఆర్థిక పురోగతిని, రాజకీయ స్వాతంత్ర్యాన్ని సాధించుకునేలా చేసేదే విద్య."
- కనుక ప్రతి భారతీయుడు విద్యావంతుడైనప్పుడే దేశం ప్రగతి పథంలో పయనిస్తుంది. ఇదే నా చివరి కోరిక. ఆకాంక్ష అంటారు -డా॥ బి.ఆర్.అంబేద్కర్.
- "అవిద్య అజ్ఞానానికి దారితీస్తుంది. అజ్ఞానం అనైతికతకు బాటలు వేస్తుంది. అనైతికతో అభివృద్ధి లేమి గోచరిస్తుంది. అభివృద్ధి లేమితో డబ్బులేని పరిస్థితులు ఏర్పడతాయి. ఆఖరికి ఈ పరిస్థితులు నిమ్మవర్గాల పీడనానికి దారితీస్తాయి. అవిద్య ఎన్నో విపరిమణాలను సృష్టిస్తుంది అంటారు -మహాత్మా జ్యోతిభా పూలే.
- " విద్య అనే మహావృక్షం వేర్లు చేదుగా ఉన్నా అవి అందించే ఫలాలు తీయ్యగా ఉంటాయి " .
  ఆ ఫలాలు అందరికి అందితే సమాజానికి మేలు జరిగినట్టే !

- "సమాజంలో అందరూ బాగుండాలి. ఆ బాగుండే సమాజంలో మనముండాలి. సమాజంలో అందరూ విద్యావంతులు కావాలి. ప్రతిభకు పేదరికం అడ్డుకాకూడదు. పేద ఇంట్లో పుట్టిన ప్రతి భారతీయుడు ఉన్నత చదువులు చదవాలి."

"అదే మా చేయూత ఫౌండేషన్ లక్ష్యం."

**"గెలుపు మీ గమ్యం అయితే గెలిపించే గమనమే మా చేయూత ఫౌండేషన్ లక్ష్యం"**

# సందేశము




**"ఈ పుస్తకాలు విద్యార్థుల విజయానికి, వికాసానికి, భవిష్యత్ కెరీర్ నిర్మాణానికి బలమైన ఆయుధాలు"**

లోక్‌సత్తా పార్టీ అధ్యక్షులు **డా॥యన్. జయప్రకాష్ నారాయణ** IAS.,



ఒంగోలు పార్లమెంట్ సభ్యులు **శ్రీ మాగుంట శ్రీనివాసరెడ్డి** గారు తన కార్యాలయంలో " **చేయూత ఫౌండేషన్** " బ్రోచర్ ను ఆవిష్కరిస్తున్న దృశ్యం .

# చేయూత ఫౌండేషన్‌కు చందాలెందుకు ?

సమాజం మనకెంతో ఇచ్చింది. మనం ఆ సమాజానికి తిరిగి కొంతైన ఇవ్వాలి అన్న ధ్యేయంతో ...

- " విద్యాదానం-మహాదానం " అన్న స్వామి వివేకానందుని సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకొని మా " చేయూత ఫౌండేషన్ " విద్యార్థుల విజయానికి, వికాసానికి, "ఫౌండేషన్ & మోటివేషన్" అందిస్తూ " కెరీర్ గైడెన్స్ " పుస్తకాలను రూపొందించింది.
- ఈ పుస్తకాలను రెండు తెలుగు రాష్ట్రాలలోని, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు, శాఖా గ్రంధాలయాలకు మరియు " ఆన్‌లైన్-ఆఫ్‌లైన్ " లోను, దాతలు ఇచ్చిన చందాలతో ఉచితంగా అందించాలనే లక్ష్యంతో విస్తృతంగా ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించడమైనది.
- ఈ పుస్తకాలు విద్య, ఉద్యోగం, ఉపాది, వికాసం, క్రీడలు,ఆర్థిక, ఆరోగ్య విషయాలు కొన్ని లక్షల మంది విద్యార్థులను సమాజంలోని పౌరులందరిని ప్రభావితం చేయగలవు .
- ఈ పుస్తకాల రచనలో మా " చేయూత ఫౌండేషన్ " గొప్పతనం ఏమీ లేదు. ఈ పుస్తకాలలోని సమాచారాన్ని వివిధ పత్రికల ద్వారా ప్రముఖ విద్యారంగ నిపుణులు, డాక్టర్లు, సైకాలజిస్ట్‌లు మరియు, వ్యక్తిత్వ వికాస నిపుణులు రచించిన ఆర్టికల్స్‌ను సేకరించి వాటిని Up to Date గా ఎడిటింగ్ చేసి Fullscape లో తయారు చేయుటకు మాకు 10 సం॥ల సమయం పట్టింది.
- ఈ పుస్తకాల ముద్రణకు, స్టేషనరీ, కార్యాలయ నిర్వహణకు, ఇంగ్లీషులో ట్రాన్స్‌లేట్ చేయుటకు, ఆడియో బుక్స్ తయారు చేయుటకు, DTP వర్కు చేయుటకు, స్కానింగ్ చేసి PDF బుక్స్ రూపంలో Online లో అందించుటకు, ఆన్‌లైన్ రెంట్లకు మొదలగు వాటనింటికి కొన్ని లక్షల రూపాయలు ఖర్చు అవుతుంది. (ఇప్పటి వరకు మా సొంత డబ్బు 10 లక్షల రూపాయలు ఖర్చు చేయటం జరిగింది ). ప్రస్తుతం ఇక ముందుకు సాగడానికి అంత ఆర్థిక స్థోమత మా " చేయూత ఫౌండేషన్ " కు లేదు.
- ఈ పుస్తకాలలోని, "విద్యా, ఉద్యోగం, ఉపాధి, వికాసం, ఆరోగ్యం " మొదలగు సమాచారం మీకు, మీ పిల్లలకు, సమాజంలోని పౌరులందరికి ఉపయోగకరమని మీరు భావస్తే, ఎలాంటి లాభాపేక్ష లేకుండా, సేవా భావంతో, మా
- " చేయూత ఫౌండేషన్ " చేపట్టిన " విద్యాదానం " పథకానికి **" కార్పోరేట్ సోషల్ రెస్పాంన్స్ బులిటి"** కింద మీకు తోచినంత ఆర్థిక సహాయం చేసి, మీ ఆర్థిక చేయూతను మా " చేయూత ఫౌండేషన్ " కు అందిస్తారని ఆశిస్తూ ...
- ఇంతవరకు చందాలు ఇచ్చి మాకు ఆర్థికంగా సహకరించిన దాతలకు, మరియు, ఈనాడు, ఆంధ్రజ్యోతి, సాక్షి, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి పత్రికల ద్వారా తమ అమూల్యమైన రచనలను అందించిన రచయితలకు, పత్రిక యాజమాన్యాలకు పేరు పేరున కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ...
- ఈ పుస్తకాలు విద్యార్థులకు, మీకు, మీ పిల్లలకు,సమాజంలోని పౌరులందరికి ఎంతవరకు ఉపయోగకరమో మీ అమూల్యమైన సలహాలు, సూచనలు అందిస్తారని ఆశిస్తూ ...

ఇట్లు

సదా, విద్యార్థులు సమాజ సేవలో

మీ శ్రేయోభిలాషి

## Organization - Information


**N.R.V. Subba Reddy**

Founder

**Cheyutha Foundation. Org**

Regd.Office : Ankabhupalem Village, Ardhaveedu (MDL),Prakasam District, Andhra Pradesh State PIN : 523335.

Branch Office : Giddaluru

Near RTC Depot. Srinivasa Nagar

3rd Line, Giddaluru

Prakasam Dt. A.P.


- Registered As Society In 2017 (Regd No. 14 of 2017)
- 12A Certified and Doantions Made to "CHEYUTHA FOUNDATION" are Exempt from Income tax U/S 80G

**Bank Account Details:**

Account Name : CHEYUTHA FOUNDATION

A/c No. : 560820110000217

IFSC Code. : BKID0005608

(Bank of India), Giddaluru Branch

Bank of India

Relationship beyond banking

BHIM BOI UPI QR

SCAN HERE TO PAY WITH ANY BHIM UPI APP

CHEYUTHA FOUNDATION

boism-9177720100@boi

UPI | BHIM

Payment Through Any UPI APP Accepted Here




**If Interested to support, Contact:**


**N.R.V. Subba Reddy**

e-mail : subbareddy.nrv@gmail.com

e-mail : cheyuthafoundation.org@gamil.com


Note : 2000 రూపాయలకు పైగా చందా ఇచ్చు చందాదారులు " చేయూత ఫౌండేషన్ " అకౌంట్‌కు మణీ ట్రాన్స్‌ఫర్ చేయగలరు. ఎందుచేతననగా U/S 80G క్రింద ఇన్‌కమ్ టాక్స్ డిడక్షన్ పొందగలరు .

- 2000 లోపు చందా ఇచ్చు చందా దారులు నా ఫోన్ పే నెంబర్‌కు 9177720100 పంపగలరు.

**Download : Cheyutha App - (Install)**

**DONATION RECEIPT**

Cell : 9177720100
Mail id :- cheyuthafoundation@gmail.com

# CHEYUTHA FOUNDATION - ORG

**Regd No - 14 of 2017 - PAN No - AAFAC8746H**

**ANKABHUPALEM (Vi), PAPINENIPALLI (PO), ARDHAVEEDU (MANDAL), PRAKASAM (DT), INDIA - 523 335**

S.No : 34 Date : 1-1-2023.

Received with thanks from Smt/ Sri P. Sreenivasa Reddy NRI Giddalur

an amount of Rs. 20,000/ (Rupees Twentey thousend Rupees only

Only)

towards Cheyutha foundation

through Cash / Cheque / Demand Draft No. ........ Date : 1-1-2023.

₹ 20,000/Rs.

N.R.V. Subba Reddy.
Signature of Founder & President

The above donations are exmpt u/s section 80G of the incme tax 1961 - unique Registration Number AAFAC8746HF 2021. Dated : 19-12-2022.

**DONATION RECEIPT**

Cell : 9177720100
Mail id :- cheyuthafoundation@gmail.com

# CHEYUTHA FOUNDATION - ORG

**Regd No - 14 of 2017 - PAN No - AAFAC8746H**

**ANKABHUPALEM (Vi), PAPINENIPALLI (PO), ARDHAVEEDU (MANDAL), PRAKASAM (DT), INDIA - 523 335**

S.No : 35 Date : 1-1-2023

Received with thanks from Smt/ Sri Ch. Venkata krishana Reddy Principal Hyd.

an amount of Rs. 10,000/ (Rupees Tenthousend Rupees only

Only)

towards Cheyutha foundation.

through Cash / Cheque / Demand Draft No. ........ Date : 1-1-2023.

₹ 10,000/Rs.

N.R.V. Subba Reddy.
Signature of Founder & President

The above donations are exmpt u/s section 80G of the incme tax 1961 - unique Registration Number AAFAC8746HF 2021. Dated : 19-12-2022.

# చేయూత ఫౌండేషన్ ఫౌండర్ పరిచయం:-




**మాది ఆంధ్రప్రదేశ్ ప్రకాశం జిల్లా, అర్ధవీడు మండలం, పాపినేని పల్లె గ్రామ పంచాయితీ అంకభూపాలెం అను ఒక చిన్న 'కు' గ్రామం. నేను MA, Bed., వరకు చదువుకొన్నాను. మా తండ్రి గారు కీ॥శే॥ నందిరెడ్డి సుబ్బారెడ్డి వృత్తిచేత ఉపాధ్యాయులు. ఆయన ప్రవృత్తి వ్యవసాయం. ప్రస్తుతం నేను అందులోనే కొనసాగుతున్నాను.**

## ఈ పుస్తకాల రచనకు ప్రేరణ

నాకు ముగ్గురు పిల్లలు : 1. కుమార్తె - 2. ఇద్దరు కుమారులు. వారు 10వ తరగతి చదువుకునేటప్పటి నుండి మా ఇంటికి మూడు దిన పత్రికలు సాక్షి - ఈనాడు - ఆంధ్రజ్యోతి పత్రికలు మరియు రామకృష్ణ ప్రభ - ఇండియాటుడే, సైకాలజీటుడే - ఉద్యోగ సోపానం మొదలగు మాస పత్రికలు వచ్చేవి. వాటిల్లో వచ్చిన విద్యారంగ విషయాలు.. **What after 10th, What After Inter, What After Degree.** అనే కెరీర్ ప్లానింగ్ & కెరీర్ గైడ్ - వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్యానికి **(Health)** సంబంధించిన విషయాలన్నిటినీ సేకరించి, మా పిల్లలకు, మా బంధువుల పిల్లలకు, స్కూల్ కాలేజీ విద్యార్థులకు చెబుతుండేవాడిని. వారంతా చక్కగా చదువుకొని కంప్యూటర్ పక్షులన్ని దేశ విదేశాలకు ఎగిరి పోయాయి. నేను, సేకరించిన, పత్రికలలోని విషయాల సమాచారమంతా మా ఇంటిలో బండిల్స్‌గా మిగిలి పోయాయి. వాటన్నింటినీ **Up To Date** గా ఎడిటింగ్ చేసి **ఈ పుస్తకాలను** తయారు చేయడమైనది. నేను పెద్ద సబ్జెక్టు ఎక్స్‌పర్ట్ నేం కాదు. నాకు ఇంటర్మీడియట్ చదివేటప్పటి నుంచి దిన పత్రికలు, వార పత్రికలు, మాస పత్రికలు పుస్తకాలు చదవడం నా హాబీ. ఆ అలవాటే ఈ పుస్తకాల రచనకు ప్రేరణ కలిగించింది. ఈ పుస్తకాల రచనలో నా గొప్పతనమేమి లేదు. వివిధ పత్రికలలో ప్రముఖ విద్యావేత్తలు - డాక్టర్లు - సైకాలజిస్టులు - వ్యక్తిత్వ వికాస నిపుణులు రాసిన ఆర్టికల్స్‌ను సేకరించి విద్యార్థుల సౌకర్యార్థం వాటిని పుస్తకాల రూపంలో తీసుకురావడం జరిగింది. వివిధ పత్రిక ద్వారా తమ అమూల్యమైన రచనలను అందించిన రచయితలకు, పత్రిక యాజమాన్యాలకు పేరు పేరున కృతజ్ఞతలు. ఈ పుస్తకాలు ఫుల్ స్కేప్‌లో తయారుచేయుటకు నాకు **10సం॥ల** సమయం పట్టింది.

**నేను ఒక రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రస్తుతం వంద అడుగులు కూడా నడవలేని స్థితి. ప్రస్తుతం నేను చేయగలిగింది ఏమీ లేదు. చదవడం వ్రాయడం తప్ప.**

సమాజం మనకు ఎంతో ఇచ్చింది. ఆ సమాజానికి తిరిగి మనము కొంతైన ఇవ్వాలి. **"విద్యాదానం మహాదానం"** అన్న స్వామివివేకానందుని సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఈ పుస్తకాలను రెండు తెలుగు రాష్ట్రాలలోని ప్రభుత్వ పాఠశాలలకు మరియు శాఖ గ్రంథాలయాలకు, ఆన్‌లైన్‌లోను "చేయూత ఫౌండేషన్" వేదికగా దాతలు ఇచ్చిన చందాలతో ఉచితంగా అందించాలనే మా ప్రయత్నానికి ఇంత వరకు ఆర్థికంగా సహకరించిన దాతలకు, పేరు పేరున కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ.., విద్యార్థులు వారి తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు ఈ పుస్తకాలలోని సమాచారం సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తూ... ప్రతి ఒక్కరికి అర్థమయ్యే విధంగా సరళమైన భాషలో ఈ పుస్తకాలు వ్రాయ బడినవి. ప్రతి ఒక్క విద్యార్థి ఆసక్తి అభిరుచి మేరకు తనకు నచ్చిన రంగంలో విజయం సాధిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించి తన తోటి వారికి ఆదర్శప్రాయంగా ఉంటూ దేశాభివృద్ధి కొరకు పాటుపడతారని కోరుకుంటూ, ఈ పుస్తకాలు విధ్యార్థులకు, సమాజంలోని పౌరులందరికి ఎంతవరకు ఉపయుక్తమో మీ అమూల్యమైన సలహాలు, సూచనలు అందిస్తారని ఆశిస్తూ..,

**ఇట్లు**
సదా విద్యార్థుల సేవలో
**N.R.V. Subba Reddy** MA.Bed.,
ఫౌండర్ : చేయూత ఫౌండేషన్